నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 27-3-2025

## ఘంటారావం

అర్థం చేసుకోవటానికి
యత్నించు
అనర్థాన్ని
నివారించు.
కలలు
ధారలవనీ
కళల
కేదారాలవనీ
మెత్తగ
ఉండాలనుకోకు
ఉత్తగ
ఉంచరని మరువకు

నీకోసం
నివసించు
పరుల కోసం
ప్రవహించు.
పట్టాలపై
పరిగెత్తకు
ఇంటిగుట్టు
విప్పకు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## నానీలు

కవి దృష్టిలో మేఘం
తేలియాడు తేరు
కలల్ని నిజాల్ని
చూడమతని తీరు

కిరణాలతో కాంతి
ప్రసరిస్తాడు రవి
చరణాలతో రవి
వివరిస్తాడు కవి

నిన్నను నేటికై
స్పృశిస్తాడు నిత్యం
రేపును ఇవాళే
దర్శించుట కృత్యం.

అనుభవాలనుభూతి
ఒక అదృశ్యం స్ఫూర్తి
అక్షరాల శిల్పంగా
కవి చెక్కును మూర్తి.

అదర్శం కవికెపుడూ
మండుతున్న సూర్యుడు
విప్లవభావాలతో
వెలిగే కవి వీరుడు



- తుమ్మూరి రాంమోహన్‌రావు
సెల్: 9701522234



## బ్రిటీష్ యుగం భారతదేశ చరిత్ర రూపశిల్పి

పుస్తక సమీక్ష

# డా॥కత్తి పద్మారావు గారి సామాజిక, సాంస్కృతిక దృక్కోణం






ప్రతులకు:
కత్తి స్వర్ణకుమారి, లుంబినీవనం, అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు-522 124, గుంటూరు జిల్లా.

డా॥ కత్తిపద్మారావు గారు భారతదేశ చరిత్రను మహాత్మాఫూలే, డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనా దృక్పథంతో వ్రాస్తున్నారు. ఇది నాల్గవ భాగం. భారతదేశ చరిత్రను ఎనిమిది భాగాలుగా వ్రాయాలనేది డా॥కత్తి పద్మారావు గారి సంకల్పం. ఈ కృషికి ఆయన ఎన్నో గ్రంథాలను పరిశీలించి సామాజిక, రాజకీయ కార్యకర్తలకే గాక సివిల్స్ స్టూడెంట్స్‌కు, గ్రూపు-1 స్టూడెంట్స్‌కు, డి.యస్.సి.స్టూడెంట్స్‌కు ఉపయుక్తంగా ఈ గ్రంథం ఉపయోగపడుతుంది. ఈ గ్రంథాలు భారతదేశ చరిత్రను సామాజిక జీవితాన్ని సాంస్కృతిక విప్లవ గమనాన్ని, భారతదేశాన్ని ఇతర దేశాల వారు ఆక్రమించిన గమనాలను స్పష్టంగా మన కళ్ళముందు రచనా శైలిలో చరిత్ర మన కళ్ళ ముందు దృశ్యాలు దృశ్యాలుగా నడిచివెళ్తూ ఒక్కసారి గ్రంథాన్ని చదివితే మొత్తం చారిత్రక కథనం మన మెదడులో రికార్డు అవుతుంది. అంత గొప్ప రచనా శైలి వారిది. ఇక కత్తి పద్మారావు గురించి పీఠికలో వారే ఇలా చెప్పారు. భారతదేశ చరిత్రను 5 భాగాలలో వ్రాయాలనే సత్సంకల్పంతో ప్రారంభించాను. ఇది బృహత్తమైన కృషి దీనికి ఒక దృక్పథాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాను. అది అంబేద్కర్, పూలే దృక్పథం. నిజానికి ఇంతవరకు వ్రాసిన భారతదేశ చరిత్రలో సాంప్రదాయకత వుంది. కొందరు మార్క్సిస్టు దృక్పథంతో వ్రాసారు. అది కూడా సస్య నిష్టగా వుంది. కానీ దానిలో సామాజికత లోపించింది. బ్రాహ్మణవాదులు ఎక్కువగా పౌరాణిక పాత్రలను హైలెట్ చేస్తూ వ్రాసారు. అందులో కాల్పనికత వుంది. సబాల్టన్ స్టడీస్ వచ్చాక అణగారిన ప్రజల, మూలవాసుల, అస్పృశ్యత స్త్రీల, మైనారిటీల, జీవనగాథలు కూడా చరిత్రలో చోటు చేసుకున్నాయి. నేను వ్రాసే చరిత్రలో సామాజిక శాస్త్రం, అర్థశాస్త్రం, భౌగోళిక శాస్త్రం, మానవ పరిణామ శాస్త్రం సమన్వయంగా వుంటాయి. వర్ణం చేత, కులం చేత, బ్రాహ్మణాధిపత్యం చేత అణగదొక్కబడుతున్న ప్రజల మనోవ్యథలు కూడా నేను వ్రాసిన చరిత్రలో వున్నాయి. ఇక ప్రముఖ చరిత్రకారుడు కత్తి పద్మారావు గారు ఈ గ్రంథాన్ని ఈ శీర్షికలతో వ్రాశారు. క్రైస్తవ ఉద్యమ స్ఫూర్తి, కంపెనీ ద్వంద్వ పాలన, ఇంగ్లీష్ వ్యాపారుల వాణిజ్యం, 1767లో వచ్చిన చట్టం, బ్రిటీష్ వారి రాకతో పరిణామాలు, మనువు ప్రభావం, వెనీడోనిగర్ విశ్లేషణ, కులం ప్రభావం, అంబేద్కర్ బోధ, అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తి, అంబేద్కర్ విద్యా విప్లవం, అంబేద్కర్ లండన్ ముచ్చట్లు, హక్కుల ఉద్యమము, బోధనావృత్తి నాకెంతో ఇష్టం, ప్రభుత్వ వ్యవస్థలో నిర్ణయాలు, పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగం దేశానికి స్ఫూర్తి, అంబేద్కర్ కృషి, హిందూ మతం నుండి మనం మారాలి, అంబేద్కర్ బోధన, అంబేద్కర్ మాటలు తాత్వికమైనవి, అస్పృశ్యత రుగ్మత, దళితులకు మతాంతరీకరణ విముక్తి బాట, ప్రస్తుత అనారోగ్య స్థితి, అంబేద్కర్ బుద్ధని తత్వం, ఆంధ్రదేశంలో దళితులు, కుల వ్యవస్థ రక్షణార్థం, సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం, భారతదేశం సుసంపన్నమైనది, దేశీయ రాజుల పోరాట స్ఫూర్తి, బ్రిటన్‌లో తన వ్యాపారం, అనైక్యత, బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణ వ్యూహం, యుద్ధంలో బ్రిటీష్ వారు, బ్రాహ్మణవాద మనుస్మృతి, భారతదేశంలో స్త్రీ, వేదాధ్యయనం, బుద్ధునికి జ్ఞానోదయం, నగరీకరణ దశలు, బౌద్ధం భారతదేశం, భారతదేశంలో బౌద్ధం, బౌద్ధం ఒక ఔషధం, బౌద్ధ సాంస్కృతిక విప్లవం, తథాగతులు బోధ గురువులు, ఆలోచనా రాహిత్యం, నిర్లక్ష్యం చేయవద్దు, నేత తాత్వికుడు, బౌద్ధం తాత్విక అంశాలు, బుద్ధుని అధ్యయనం, ఆనందునితో చర్చ, భిక్షు సంఘ నియమాలు, ఫ్రెంచి వాళ్ళు రాక, భారతీయుల బలహీనతయే కారణం, బెంగాల్ కొత్త నవాబు, ఆంగ్లేయుల దురాక్రమణ, మీర్ జాఫర్, అస్పృశ్యతా చరన, సముద్రయానం, యుద్ధ నష్ట పరిహారం, అగ్రకుల వ్యాపారం, పోర్చుగీసు వారి ఆక్రమణలు, వర్తక వ్యాపారాలు, తీర ప్రాంతంలో వ్యాపారం, మచిలీపట్నం ప్రాధాన్యత, మద్రాను పట్నం, మహారాష్ట్ర ప్రాధాన్యత, ఛత్రపతి శివాజీ పోరాట కౌసలం, ఔరంగజేబు వర్తన, శివాజీ పోరాటం, ఔరంగజేబు తొత్తులు, ఔరంగజేబు దర్బారు, శివాజీ పోరాట తత్వం, శివాజీ వీరత్వం, శివాజీ వ్యూహాలు, శివాజీ విన్యాసాలు, శివాజీ కుమార్తె ఆశక్తి, బ్రిటీష్‌వారి విస్తరణ, బ్రిటీష్ వాళ్ళ దుర్వ్యూహాలు, సమాజ ప్రకృతి, బ్రాహ్మణులు క్రియా సూన్యులు, సిపాయిల తిరుగుబాటు, భానత సాంస్కృతిక యోధులు, బ్రిటీష్ వారి కార్యములు, జ్యోతిరావు విద్యాభ్యాసం, స్త్రీ విద్య, జీవన గోళం, పాల సముద్రం, చారిత్రక సాంస్కృతిక గమనం, దేవుళ్ళు వాహనాలు, సృష్టి సిద్ధాంతం, మానవ పరిణామ శాస్త్రం, మనుస్మృతి భావజాలం, అంబేద్కర్ మేధస్సు, ఆంగ్లో ఇండియన్లు, హిందూస్థాన్ మూలం, మొగల్ సామ్రాజ్యానంతర విస్తరణ, మౌలానా మహమ్మద్ అలీ, హిందూ మహాసభ మూలం, హిందూ మహాసభ ముస్లిం లీగ్, హిందూవాద భావజాలం, సావర్కర్ సిద్ధాంతం, అంబేద్కర్ బుద్ధవాది, అంబేద్కర్ వాదనలు, అంబేద్కర్ లౌకికవాదం, అంబేద్కర్ మేధస్సు, హిందువుల మనస్తత్వం, అంబేద్కర్ సిద్ధాంత భావం, అంబేద్కర్ స్త్రీవాదం, అంబేద్కర్ లౌకికరాజ్యం, హిందూవాద చరిత్ర గమనం, అంబేద్కర్ ఆలోచనలు, మనువు మూలం, స్త్రీలను న్యూనత పరిచింది, శౌనకుడు, స్త్రీ అణచివేత, బౌద్ధమతం శాస్త్రీయమైన మతం, చరిత్రపై బౌద్ధ ప్రభావం, జాతీయోద్యమంలో కులం, బౌద్ధం ప్రభావం, యానాం గాధ, వృత్తుల వ్యవస్థ, దేశ విదేశీ వాణిజ్యం, మతాల మనుగడ, యజ్ఞ జీవితం, బౌద్ధ భారతం. నిజానికి ఈ గ్రంథంలోనికి మనం వెళ్ళితే భారతదేశ చరిత్ర మన కళ్ళకు కట్టినట్టు కనబడుతుంది. అనేక కొత్త కోణాలు కనబడతాయి. ముఖ్యంగా మహాత్మాఫూలే ఒక సాంస్కృతిక యోధుడుగా భారతదేశ సాంస్కృతిక విప్లవానికి ఎలా మూలకర్త అయ్యాడో ఈ గ్రంథం మన కళ్ళముందు ఇలా దృశ్యీకరిస్తుంది. బ్రిటీష్ ప్రభుత్వం మీద భారత సాంస్కృతిక యోధుల ప్రభావం వుంది. పీష్వాల రాజ్యంపై మహాత్మా పూలే ప్రభావమే కాదు, బ్రిటీష్ ప్రభుత్వాల మీద కూడా పూలే ప్రభావం వుంది. అయితే బ్రహ్మ సమాజం, ఆర్య సమాజానికి చరిత్రకారులు ఇచ్చిన ప్రాధాన్యం బుద్ధునికి, పూలేకి, అంబేద్కర్‌కు ఇవ్వలేదు. సాహూ మహరాజ్, నారాయణ గురూ వంటివారు భారత సమాజంలో ఎన్నో మార్పులు తెచ్చారు. భారతదేశంలో ఏ మూల మార్పు జరిగినా అది భారతదేశం మొత్తం విస్తరిస్తుంది. పూలే ప్రభావం భారతదేశం మొత్తం వుంది. అది హిందూ భావజాల పునాదులు తవ్వగలిగిన స్థాయిలో వుంది. పూలే బ్రాహ్మణవాద ఆలోచనలకు ప్రత్యామ్నాయ భావజాలాన్ని సృష్టించాడు. ఈ గ్రంథ రచనలో డా॥కత్తి పద్మారావు గారు విస్తృతమైన అధ్యయనం చేశారు. మనకు అనేక విషయాలు తెలియడమే కాక విస్తృతమైన అధ్యయనానికి పురికొల్పుతుంది. ముఖ్యంగా మహాత్మా పూలే, అంబేద్కర్ దృక్పథంతో ఆయన వ్రాశారు. ఈ గ్రంథానికి 1) Indian History, Krishna Reddy, 2) The Hindus, An Alternative History, (Wendy Doniger), 3) Last Few Years of Dr. Ambedkar (Nanak Chandrattu) Amrith Publishing House, 4) Path To Salvation (Dr.B.R.Ambedkar), 5) Philosophy Science And Social Progess (Suman Gupta), 6)A Survey of India History, 7) Challenging Untouchability, Simon R.Charsley, GK.Karanth, 8) Freedom Struggle, Bipan, 9) Indian Nationalis, An History, 10) History and beyond by Romila Thapar, 11) Mahatma Jotirao Phooley, father of the Indian Social Revolution by Dhananjay keer, 11) Modern Indian, Sumit Sarkar, 12) శ్రీ కృష్ణ దేవరాయలు, (బలిజ కాపుక్షత్రియుడు), 13) అన్నమయ్య విన్నపాలు, విద్యాన్ ముదివర్తి కొండమాచార్యులు 14) ఫ్రెంచి పాలనలో యానాం, బొల్లోజు బాబా.

డా॥కత్తి పద్మారావు గారి గ్రంథాలయాన్ని నేను స్వయంగా వీక్షించాను. డా॥బి.ఆర్. అంబేద్కర్ రాజగృహం తలపిస్తుంది. భారతదేశంలోనే స్వీయ గ్రంథాలయం ఇంత గొప్ప గ్రంథాలయం లేదు అంటే అతిశయోక్తి కాదు మరొక చోట. ఈ పుస్తకం చదువుతుంటే ఆ గ్రంథాలయంలోని సారమంతా దృశ్యీకృతమైంది. ఈ గ్రంథాన్ని లోకాయత పబ్లికేషన్స్ ప్రచురించింది. ఈ గ్రంథం 391 పేజీలు, రూ.400/-లు సుమారు 50 చిత్రాలతో ఈ గ్రంథం మీలో నూతన చైతన్యాన్ని కలిగిస్తుందని ఆశిస్తున్నాను.



-బత్తుల నీలిమ
సెల్:9618922814

## లొకేషన్ పెట్టు

ఓ నీటిచుక్కా!
నీ లొకేషన్ పెట్టు
దోసిలి పట్టి
నా సీమ పై చల్లాలనుంది.
ఓ అన్నదాత!
నీ లొకేషన్ పెట్టు
దళారిని మట్టుబెట్టి
గిట్టుబాటు ను అందించాలనుంది.
ఓ యువకవీ!
నీ లొకేషన్ పెట్టు
కవిత్వంలో కల్పనలొద్దు
అక్షరానికి ఆయువు
నిజమొక్కటేనని చెప్పాలనుంది.
ఓ నాయకుడా!
నీ లొకేషన్ పెట్టు
బడుగుల అడుగులు
నిన్ను వెంబడిస్తున్నాయని
హెచ్చరించాలనుంది.
ఓ ఉపాధ్యాయుడా!
నీ లొకేషన్ పెట్టు
ఆచార్య దేవోభవ అన్న మంత్రాన్ని
మళ్ళీ ఉపదేశించాలనుంది.
ఓ చిత్రకారుడా!
నీ లొకేషన్ పెట్టు
గజిబిజి గీతలొద్దు, గిజిగానికి గూడు
అల్లమని నివేదించాలనుంది.
ఓ ఓటరూ!
నీ లొకేషన్ పెట్టు
నీ ఓటు ప్రజాస్వామ్యానికి
గుండెపోటు కాకూడదని
బతిమలాడాలనుంది.



-మాయకుంట్ల నారాయణరెడ్డి
99896 86603

## జాగ్తే రహో

జాగ్తే రహో అని మనుషులను హెచ్చరిస్తాం
మనసును జాగురూకతతో ఉంచేదెవరు
రూపాయే మనసు మెచ్చిన పాపాయైతే
పాపాలకు శాపాలకు వెరవని ఆయుధమైతే !
సంపాదనలేనిచోట వేదనే శోధనవుతుంది
రోదనలోంచి రోదసీ పయనమయ్యే ఆలోచనలు
వెతుకుతుంటారు
ఎండిపోయిన బోర్ వెల్ లా
పలురకాల తిండి యావలో
మనసు తడి ఇంకిపోతుంది!
జాగ్తేరహో భయ్యా
దునియా గలీజైపోయిందని అన్నారెవరో
రిలీజై వెళ్లి పోయిన ఫ్లాప్ సినిమాలా
ఆలోచనలు ఫ్లాష్ లా వచ్చి పలకరిస్తుంటాయి
వాటిని నెట్టేయకుండా
నెట్టింట్లో (నివటి) పెడదాం
అది మరొకరికి మకరందం కావొచ్చు
మనల్ని ఎప్పుడో గిల్లొచ్చు..
గిల్ట్ తో మెల్ట్ చేయొచ్చు..!
ఏమో గుర్రం ఎగరావచ్చు!



-సి.యస్.రాంబాబు
8374818961

# సాహిత్య సామాజిక సేవాపథ దీపధారి 'అందరిల్లు' డా॥వింజమూరి సూర్యప్రకాశ్




జులపాల్లా పెరిగిన జుట్టు
నిరాడంబరంగా వుండే కట్టు
మాట మటుకు -నిజాయితీ ఉట్టి పడేటట్టు
చేతలేవయినా పదిమందికీ ఉపయోగపడేటట్టు
సమాజ సేవలో ఆయన వందల మంది పెట్టు



ఆయనే- డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్.ఆయన వృత్తికి వైద్యుడే. కానీ ప్రవృత్తికి సమాజసేవకు ఏ వేళకయినా సిద్ధమనే ఆద్యుడే ! అవును ఆయనకు జుట్టు ఇష్టం. వేలాదిమంది 'జట్టు' ఇష్టం. పొడుగు జడ డాక్టర్ సామవేదం కామేశ్వరిని పెళ్ళాడి ఆవిడ స్త్రీల ఆరోగ్యంకోసం నిస్వార్థంగా క్లినిక్ లో వైద్యం చేస్తూంటే ఆమెను తనతో బాటు సంఘసేవకూ సహచరిని



చేసి తామి ద్దరూ తమ ఇద్దరి పిల్లలకే కాక ఎందరికో సంరక్షక దంపతులయ్యారు.




"ఆకలేస్తే అన్నం పెట్టు
చేతిలో తప్పక ఒక పుస్తకం పట్టు
స్త్రీలకు కన్నీరు కార్చని దారి చూపెట్టు
అబద్ధం చెప్పనని ప్రతిన పట్టు
ఆత్మహత్యలను అరికట్టు
అందరికోసం బ్రతికి చూపెట్టు"

అన్నదే వారి ఆశయం మాత్రమే కాదు.ఆచరణాత్మకంగా చేసి చూపుతూ అందిస్తున్న సందేశం.

1999 నుంచీ జీవితాన్ని సమాజానికే అంకితం చేసిన విశిష్ట వ్యక్తి సూర్యప్రకాశ్. 1983 లో అక్క మరణంతో విచలితుడై జీవితాన్ని గురించిన ఆలోచనతో పథ నిర్దేశం చేసుకుని ,అనేక రుగ్మతలకు కారణం ఆకలి అని భావించి అరటిపండ్లు ఉచితంగా బండి మీద పంచడంతో ప్రారంభించి, కడుపుకే కాదు బుద్ధికీ , హృదయానికీ కూడా ఆకలి తీరడానికి పుస్తకం



అవసరాన్ని గుర్తించి సాహి త్యాన్ని ప్రచులితం చేయడం కూడా బాధ్యతగా తలకెత్తుకున్నారు.

హైదరాబాద్ లోని కొత్తపేటలో 2006 లో వారు నెలకొల్పిన 'అందరి ఇల్లు' ఆకలిగొన్న వారు ఎవరయినా ఏ వేళయినా వచ్చి, ఎవరి అనుమతి అక్కర్లేకుండానే ,ఉచితంగా అక్కడున్న బియ్యం ,పప్పు ఉప్పు అన్నీ తీసుకుని అక్కడే తామే వండుకుని భోజనం చేసి పుస్తకాలు చదువుకోగలిగే, తామంత తాము కష్టపడి ఎదగగలిగే అవకాశాలను ఇప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతూ వుండడం అద్భుతమైన వాస్తవం.

1999 నుండి లైఫ్ . హెచ్.ఆర్. జి గా సాగుతూ 2011 నుంచి స్ప్రెడింగ్ లైట్స్ పేర సాగుతున్న సామాజిక సాహిత్య సాంస్కృతిక సేవ సూర్యప్రకాశ్ నిబద్ధతకు దర్పణం. 2011 జులై 18 నుండి అక్టోబర్ 25 వరకూ వందరోజులు వంద పుస్తకాలపై వందమంది రచయితలతో పఠనా భిలాష పెంచేందుకు నిర్వహించిన కార్యక్రమం సూర్యప్రకాశ్ ఆశయ మార్గంలో ఒక చరిత్రా త్మక ఘట్టం. 2013 లో అందరిఇల్లు లో 'ట్రీ హౌస్' నెలకొల్పారు. 2015 లో కాలధర్మం చెందినా తల్లి స్మృతిలో డా.సూర్యప్రకాశ్ 'దే ఆర్ దేర్ 'అనే గ్రంథం రాసి ప్రచురించారు. 2016 లో "అందరం బాగుండాలి.. మనవంతున'' పేర స్త్రీలకోసం 70 రోజుల కార్యక్రమం,అలాగే 2017 లో ఆత్మహత్యల నివారణకు తలపెట్టి చేసిన కార్యక్రమం వీటన్నిటా ఆయన ఎందరో రచయితలు రచయిత్రులను కూడా కలగలుపుకు వెంటనంటి సాగారు.

డాక్టర్ సూర్యప్రకాశ్ తండ్రినుండి సంక్రమించిన అప్పులను తీర్చి వారసత్వంగా పొందిన చింతల్ లోని ఆనంద నిలయం కూడా సమాజానికే అంకితంచేసి అక్కడ2019 లో దివంగత ప్రముఖ రచయిత్రులు అబ్బూరి ఛాయాదేవి కె.బి.లక్ష్మి ల స్మృతిలో ఒక వంటశాలతో సహా వేలాది పుస్తకాలతో బృహత్ గ్రంథాలయాన్ని మొదలెట్టారు. సూర్యప్రకాశ్ ,కామేశ్వరి వైద్యదం పతులు 2020 -21 కోవిడ్ కష్టకాలంలో అందించిన సేవలతో వేలాదిమంది సురక్షిత జీవనం నిలుపుకున్నారంటే అతిశయోక్తి కాదు .2020 లోనే ప్రేమ ,నిజాయితీ అనే అంశంతో అంతర్జాల సమావేశాలు నిర్వహించడం అలాగే హైదరా బాద్‌లో, తెలంగాణ జిల్లాల్లో నే కాక తమిళనాడు, కర్ణాటక, కేరళలో వందకు పైగా మినీ గ్రంథాలయా లను నెలకొల్పి వాటిల్లో అనేక గ్రంథాలను సేకరించి భద్రపరచడం ఒక అపూర్వ ఘట్టం.

డా॥సూర్యప్రకాశ్ ఆంగ్లంలో పలు కవితాత్మక రచనలు చేయడం మాత్రమే కాక సంకలనం వేశారు. గొప్ప ప్రకృతి ప్రేమికుడు, చెట్ల పెంపకం,జంతు సంరక్షణ శ్రద్ధాళువుగా మంచి ఫోటోగ్రాఫర్ కూడాను. ప్రతినిత్యం వాట్సప్ లో శుభోదయ వేళ వారు పంపే పోస్టింగ్ల పట్ల ఆసక్తి చూపేవారు ఎంద రో !ముఖ్యంగా డాక్టర్ సూర్య ప్రకాశ్ సహకా రంతో వారి శ్రీమతి డా.కామే శ్వరి స్త్రీల ఆరోగ్యం కోసం ఎంత గానో శ్రమిస్తూ, అనవ సరంగా గర్భ సంచీలు తొలగించబడ కూడని ఉద్యమ సారథిగా వ్యవహరిస్తూ వేలాదిమంది స్త్రీలకు




సంతాన భాగ్యం కలిగించిన వైద్యురాలిగా పేరొందారు, తెలుగులో సంతాన సాఫల్య అవగాహన కలిగించే "మధు మాలతి " గ్రంథం వెలువరించారు.వీరి సంతానం కూతురు లక్ష్మీ గాయత్రి సింగపూర్ లో వైద్యవృత్తిలో ,కుమారుడు ఫ్రాన్స్ లో ఉన్నతవిద్యా భ్యాసంలో రాణిస్తున్నారు.



మీ ఆహారాన్ని,రచనా జ్ఞానాన్ని, బాధ్యతలను నిరపేక్షతో, నిరభ్యంత రంగా, శక్తిమేరకు నిరంతరంగా ప్రేమతో నిజాయితీతో పంచుకోండి అని ఆచరణాత్మకంగా తాను చేసి సమాజానికి సందేశిస్తున్న డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్ కు ఈ2025 మార్చి 27 కు షష్టిపూర్తి. నూటికో కోటికో ఇలాంటి విశేష వ్యక్తులుంటారు. అబ్బూరి ఛాయాదేవి, తురగాజానకీరాణి ,సంబూరి పరిపూర్ణ,కె.బి .లక్ష్మి,దాసరి



శిరీష ,నిజాం వెంకటేశం ,బి.ఎస్.రాములు ,శిలా సుభద్రాదేవి,విహారి,భీమరాజు వెంకటరమణ ,సలీం , వంటి సాహితి ప్రముఖులేకాక డి.చక్రపాణి (ఐఏఎస్), సుమతి (ఐపీఎస్ ) వంటి వివిధరం గాల ఎందరెందరి అభిమానాన్నో చూరగొన్న వైద్యదంపతులు కు ముఖ్యంగా నేడు షష్టిపూర్తి



జన్మది నోత్సన డా.వింజమూరి సూర్యప్రకాశ్ గారికి శుభాభినందనలు.

సమాజ సేవా స్ఫూర్తి దాయక దీపధారిగా ఆయురారోగ్యాలతో వుండాలని శుభాభినందనలు

**(27.3.2025 డా.సూర్యప్రకాశ్ వింజమూరి షష్టిపూర్తి సందర్భంగా)**



-సుధామ
98492 97958

# లలాట రేఖ

కథ

“ఈ సంగతి విన్నారా?” ఏ సంగతీ అంత తొందరగా చెప్పకుండా ఊరించే కూపీరావు ఉవాచ.

“నీ ఊరింత ఆపి సంగతేదో ఏడువు” వివేక్ కసిరాడు.

“నువ్వలా కసిరితే నేను చెప్పనుపో” కూపీరావు బెట్టు చేశాడు.

“బాబ్బాబూ! నువ్వలా అనకురా ఇప్పటికే ఉత్సుకతతో నా తల పగిలిపోతోంది” ఆరా రావు బతిమాలాడు.

“ఒరేయ్ కూపీ! నువు చెప్పబోయే సంగతి నాకూ తెలుసు. చెప్పమంటావా?” భోగట్టా మూర్తి బెదిరించాడు.

కూపీరావు ఖంగు తిన్నాడు.

కూపీరావు, వివేక్, ఆరా రావు, భోగట్టా మూర్తి ఆ ఊళ్ళో స్కూల్ ఫైనల్ పాసై, ఆ తర్వాత ఉన్నత చదువులు చదివి, ప్రస్తుతం దేశంలోని వివిధ నగరాల్లో ఉన్నత ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. ప్రతి సంక్రాంతి పండగ వారు తమ ఊళ్లో జరుపుకుంటారు. ప్రస్తుత కథా నాయకుడు విశాల్, స్కూల్ ఫైనల్ లో వారి సహాధ్యాయే.

ఐతే అతను, దాదాపు పది సంవత్సరాల క్రితం ఊళ్లోనుండి పారిపోయిన బాపతు. ఇక గతంలోకి తొంగి చూస్తే ?

“సుందరం గారబ్బాయి విశాల్, సర్పంచ్ గారబ్బాయిని స్పృహ తప్పేలా కొట్టి ఎటో పారిపోయాడట”.

“సర్పంచ్ గారబ్బాయి, విశాల్ వాళ్ల చెల్లాయి జడ గుంజి అసభ్యంగా ప్రవర్తించాడట. చెల్లాయి ద్వారా విషయం తెలుసుకున్న విశాల్, సర్పంచ్ గారబ్బాయితో గొడవ పద్దాడట. విశాల్ తోస్తే సర్పంచ్ గారబ్బాయి తల రాయికి కొట్టుకొని రక్తం ధారలు కట్టి స్పృహ తప్పాడట. ఆ సంఘటనతో భయపడ్డ విశాల్, ఎటో పారిపోయాడట” ఊరి వాళ్ల మాటలు.

అప్పుడు ఊరినుండి వెళ్ళిపోయిన విశాల్, దాదాపు పది సంవత్సరాల తర్వాత, ఓ పెద్ద స్కోడా కారులో, సూటు బూటుతో హూందాగా ప్రత్యక్షమయ్యేసరికి, అందరికీ వింతగా ఉంది. విషయమేంటో కనుక్కుందామని అతని సహాధ్యాయులు విశాల్ ఇంటికి వెళ్ళారు. వారిని చూడగానే విశాల్ కళ్లు మెరిశాయి.

తన స్నేహితులను సాదరంగా ఆహ్వానించి, టీ ఫలహారాల తర్వాత వారితో వాగు గడ్డకు బయలుదేరాడు.

మిత్రులంతా తన గతం గురించి ఉత్సుకతతో ఉండడం గమనించి, విశాల్ చెప్పడం మొదలు పెట్టాడు.

“నా దెబ్బకు సర్పంచ్ గారబ్బాయి స్పృహ తప్పగానే చండశాసనుడైన సర్పంచ్ కి భయపడి, నా సర్టిఫికెట్లు తీసుకొని రైల్వే స్టేషన్ కి పరుగెత్తి అప్పుడే కదలడానికి సిద్ధంగా ఉన్న రైలెక్కాను. తీరా చూస్తే అది సెకండ్ ఏ.సీ. కంపార్ట్మెంట్. దిగుదామంటే అప్పటికే రైలు వేగమందుకుంది. అంతట్లో టీ.సీ. వచ్చాడు. నా దగ్గర సెకండ్ ఏ.సీ. మాట దేవుడెరుగు, అసలు సెకండ్ క్లాస్ టికెట్టు కూడా లేదు. జేబులో డబ్బులు కూడా లేవు.

“నా దెబ్బకు సర్పంచ్ గారబ్బాయి స్పృహ తప్పగానే చండశాసనుడైన సర్పంచ్ కి భయపడి, నా సర్టిఫికెట్లు తీసుకొని రైల్వే స్టేషన్ కి పరుగెత్తి అప్పుడే కదలడానికి సిద్ధంగా ఉన్న రైలెక్కాను.

టీ. సీ. నన్ను జైలుకి పంపిస్తానని బెదిరించాడు. అప్పుడు అక్కడ ఉన్న ఓ పెద్ద మనిషి, జరిమానాతో సహా నా టిక్కటుకి డబ్బులు కట్టారు. అక్కడ ఖాళీగా ఉన్న బర్త్ నాకు అలాటయింది. టీ.సీ. వెళ్ళిన తర్వాత నా పాలిట ఆ భగవంతుడు, నా వివరాలు అడిగారు. ఏ విషయం దాచుకోకుండా ఉన్న విషయం చెప్పాను. దానికి వారు నాకు ధైర్యం నూరిపోసి, తనతో రాజస్థాన్ రాజధాని జైపూర్ తీసుకెళ్ళారు. అక్కడికి వెళ్లిన తర్వాత తెలిసింది, వారి పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారనీ, జైపూర్లో ఆ వృద్ధ దంపతులిద్దరే ఉంటున్నారనీ. నన్ను తిరిగి వెళతావా అంటే లేదని చెప్పాను. ఎందుకంటే సర్పంచ్ నన్ను వదలక, పోలీసులకు అప్పజెపుతాడని భయమేసింది.

నాలో తమ మనవడ్ని చూసుకున్న ఆ జంట, నన్ను డిగ్రీ దాకా చదివించారు. అంతలో సిలికాన్ వ్యాలీలో ఒక సాఫ్ట్ వేర్ కంపెనీకి అధిపతి ఐన వారి అబ్బాయి కుటుంబంతోసహా, సెలవుపై తన తల్లిదండ్రులను కలవడానికి వచ్చాడు. నా వివరాలు తెలుసుకొని, అమెరికాలో తన కంపెనీ వ్యవహారాలు చూసేందుకు ఒక నమ్మకమైన వ్యక్తి కావాలని చెప్పి, నన్ను అమెరికా తీసుకెళ్ళాడు.

అక్కడ మంచి జీతభత్యాలు ఇస్తూ ఇంటి మనిషిగా చూసుకున్నారు. సర్పంచ్ ఐదేళ్ల కింద కాలం చేశాడని తెలిసింది. వాళ్లబ్బాయి కూడా లండన్ లో ఉన్నాడన్నారు. జీవితంలో ఒక స్థాయికి వచ్చిన నేను, మా వాళ్ల దగ్గరకు వచ్చాను. ఇక పెళ్లి చేసుకొని మళ్లీ సిలికాన్ వ్యాలీకి తిరిగి వెళతాను.” విశాల్, తన చిన్ననాటి సహాధ్యాయి ఐన సుజనకు ఇంకా పెళ్లి కాలేదని తెలిసి కారణం అడిగాడు.

“వేరే ఏ కారణమూ లేదు, కట్నం పిశాచి కోరలు చాపుతోంది. పేద వాడైన సుజన నాన్న, ఏ మాత్రం కట్నం ఇచ్చే స్థితిలో లేడు. స్కూల్ ఫైనల్ తో చదువు మానేసిన ఆమెకు మంచి సంబంధం, అదీ కట్నం లేకుండా ఎలా వస్తుంది?” అన్నారు ఊళ్లోవారు.

“ఎలా ఏమిటి? ఇలానే వచ్చింది. అన్నాడు విశాల్. నిజానికి క్లాసులో ఎంతో తెలివిగా, అణకువగా ఉండే సుజన అంటే విశాల్ కు సదభిప్రాయం ఉండేది.

జీవితంలో స్థిరపడ్డ తర్వాత ఆమెనే పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నాడు. కాని విధి అతన్ని, ముందు జైపూర్, ఆ తర్వాత అమెరికా తీసుకెళ్లింది. అతని చిన్ననాటి కల ఇప్పుడు సాకారం అయింది. తన, సుజన, తల్లిదండ్రుల అనుమతితో, కట్నం లేకుండా, పెళ్లి ఖర్చులు కూడా తనే పెట్టుకొని సుజన మెడలో మూడు ముళ్లు వేశాడు విశాల్.

“అభినందనలు విశాల్, సుజనా! అంతా మీ లలాట రేఖల మహిమ'' మిత్రులంతా కోరస్ పాడారు.



-అంబల్ల జనార్దన్
8850349858
9987533225

# మీ వారేం చేస్తారు?

కథ

2002లో రాసిన కథ

"మీ వారేం చేస్తారు?"

పక్కనే అణు విస్ఫోటనం ఏదో జరిగినట్లుగా ఉలిక్కిపడి, ఆ ప్రశ్న విన్పించిన వైపు చురుగ్గా చూసింది కళ్యాణి డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ సుమిత్ర కొత్త వచ్చిన సి.ఇ.ఓను అడుగుతోంది. సున్నితంగా కోక్‌సిప్ చేస్తున్న సి.ఇ.ఓ. ఏదో చెప్పింది. ఆ మాట ఏదీ కళ్యాణి చెవులకు విన్పించలేదు. "మీ వారేం చేస్తారు?" అన్న ప్రశ్న గుండెల్లో కల్లోలాన్ని సృష్టించింది.

"ఇంతకూ మన మేడం హబ్బీ ఏం చేస్తారో?" సి.ఇ.ఓ. పి.డి.డి.ఆర్. డి.ఏను అడుగుతోంది.

అందుకు సుమిత్ర ఏదో చెప్తోంది. అవేవీ కళ్యాణికి విన్పించడం లేదు.

రాజకీయంగా చైతన్యం వంతమయిన జిల్లా అది. ఆంధ్రదేశంలో అతి సున్నితమైన జిల్లా కూడా అదే. భౌగోళికంగా ఎక్కువ విస్తీర్ణంలో అడవులు వ్యాపించడంతో తీవ్రవాదుల ప్రాబల్యమూ ఎక్కువే. కాంగ్రెస్, కమ్యూనిస్టుల్లాంటి సాంప్రదాయక రాజకీయ పార్టీలతో పాటుగా, రాష్ట్రస్థాయి ప్రాంతీయ పార్టీలు, జిల్లా స్థాయి ఉప ప్రాంతీయపార్టీలు, విప్లవ గ్రూపులు, పౌర హక్కుల సంఘాలతో పాటుగా వైరుధ్యాలు, ప్రసన్నతులు, పగలు, ప్రతీకారాలు అన్నీ ఆ జిల్లాకు ఎక్కువే.

అధికారంలో ఏ పార్టీ వున్నా.. ముఖ్యమంత్రిగా ఎవరున్నా.. ఆ జిల్లాను అపురూపంగా చూసుకోవాల్సిందే. అలాంటి జిల్లాకు, ప్రయోగాత్మకంగా టాప్ ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లందర్నీ ఆడవాళ్ళనే పోస్టు చేశాడు ముఖ్యమంత్రి.

కలెక్టర్ ఎస్.పి. మేజిస్ట్రేట్ డి.ఆర్.డి.ఏ.పి.డి. సవాలక్ష కార్పోరేషన్లు ఇ.డి.లు అందరూ స్త్రీలే.

మిగతా జిల్లాల అధికార్లందరూ ఆ జిల్లాను "మళయాళ జిల్లా" అని వ్యంగ్యంగా పిలుస్తూ వుంటారు.

కళ్యాణి ఆ జిల్లాకు వచ్చిన ఇరవయ్యో కలెక్టరు. ముఖ్యమంత్రి బలవంతం మీద, అయిష్టంగానే ఆ జిల్లాకు వచ్చింది. వచ్చేటప్పుడు ఒక సూట్‌కేస్‌లో రెండు మూడు చీరెలు తప్పిస్తే మరేమీ లేదు ఆమె లగేజి. తనలాంటి స్ట్రెయిట్‌ఫార్వర్డ్ అధికారి. ఆ జిల్లాలో పనిచెయ్యలేదన్న విశ్వాసం, ఆ జిల్లా గురించి పరోక్షంగా విన్న అనుభవాల ద్వారా ఆమె ఏర్పరచుకుంది. అందుకే తను వచ్చీ రాగానే, చార్జి తీసుకునీ తీసుకోగానే ఏ రాజకీయ పార్టీనో, ముఖ్యమంత్రిని ఇన్‌ఫ్లూయెన్స్ చేసి ట్రాన్స్‌ఫర్ చేయిస్తుందని ఆమె నమ్మకం.

కానీ చిత్రంగా రెండు రోజులు అనుకున్న కళ్యాణి ఆ జిల్లాలో విజయవంతంగా రెండేళ్ళు పూర్తి చేసుకుంది. ఆ సందర్భంగా జరుగుతున్న పార్టీ అది. జిల్లాలోని చిన్నా, పెద్ద ఆఫీసర్లందరూ ఆ పార్టీకి హాజరయ్యారు. నిజానికి కళ్యాణి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకే కాదు. అంతర్జాతీయ రేటింగ్ సంస్థల ద్వారా ఆంధ్రదేశంలోని వివిధ జిల్లాలకు యిప్పించిన రేటింగ్స్‌లో మొదటి స్థానాన్ని ఆ జిల్లా కైవసం చేసుకుంది. అందుకుని జరుగుతున్న పార్టీ కూడా అది.

"మేడమ్ ఒక మిస్టరీ! ఇంక హబ్బీ గురించి మనకేం తెలుస్తుంది? తన గురించి ఎవరూ మాట్లాడుకోవడం కానీ, ఏదైనా తెలుసుకోవాలని ప్రయత్నించడం కానీ మేడమ్‌కి యిష్టం వుండదు. గత రెండేళ్ళుగా ప్రయత్నిస్తున్నా.. మేడమ్‌కి సంబంధించిన ఏ విషయమూ పక్కాగా ఒక్కటి కూడా తెలుసుకో లేకపోయాము. ఆవిడకు సంబంధించి ఏ విషయం మీకు తెలిసినా అది వట్టి ఊహాగానం మాత్రమే!" సి.ఇ.ఓ.కి వివరిస్తోంది సుమిత్ర.

కళ్యాణి తమ వైపే రావడం చూసి యిద్దరూ మాటలు ఆపేశారు.

×××

పక్కమీద వాలిందన్న మాటే కానీ, కళ్యాణీ మనసంతా చేదు పులుముకున్నట్లు అయింది. ఒక చిన్న ప్రశ్న, ఆమెను అల్లకల్లోలం చేసింది. అవును మావారేం చేస్తారు?" ఆమె మనసు పొరల్లో నుండి ఒక్కొక్క అనుభవం శకలమూ జారిపడి ఆమెను వేధించసాగాయి.

"మాధవ్" అన్న మూడక్షరాల పేరు చాలా కాలానికి మళ్ళీ ఆమె మనసు ముంగిట్లో అలజడి సృష్టించసాగింది. భారంగా కళ్ళు మూసుకుంది కళ్యాణి.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన చివరి అమ్మాయి కళ్యాణి. కుదురయిన కన్ను, ముక్కు తీరుతో చూడగానే యిట్టే ఆకర్షించే రూపం దానికి తోడు తార్కికంగా ఆలోచించగలిగిన శక్తి, పది మందిలో ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. సాంప్రదాయక మధ్యతరగతి కుటుంబం కావడంతో డిగ్రీ అయిపోగానే పెళ్ళి ప్రయత్నాలు మొదలయ్యాయి.

జరిగిన ఒకే పెళ్ళి చూపుల్లో "మాధవ్"ను యింప్రెస్ చేయగల్గింది. పదో రోజుకల్లా కళ్యాణి అల్లా "కళ్యాణి మాధవ్" అయిపోయింది. స్ఫురద్రూపి, అందగాడూ అయిన మాధవ్ ఆమె చెయ్యి అందుకోవడంతో అందరూ ఆమె అదృష్టాన్ని చూసి అసూయపడ్డారు.

××

భార్యభర్తలు గదిలోకి పంపాక మాధవ్ అడిగిన మొదటి ప్రశ్న..

"నువ్వెవర్నయినా ప్రేమించావా?"

"లేదు" అన్నది కళ్యాణి కొంత అసహనంగా..

"పోనీ నిన్నెవరయినా ప్రేమించారా?" మళ్ళీ అడిగాడు.

"నాకు తెలీదు".

"తెలీదా? యింత అందాన్ని ఎవడో ఒకడు ప్రేమించే వుంటాడు. అవునూ నీది కో ఎడ్యుకేషన్ కాలేజీ కదూ! నిన్ను ఎవరో ఒకరు ప్రేమించే వుంటారు. నువ్వే నాకు చెప్పడం లేదు.." సర్కాస్టిక్‌గా అడిగాడు మాధవ్.

"నేను ఎవర్నీ ప్రేమించలేదు. నన్ను ఎవరయినా ప్రేమించారేమో నాకు తెలీదు అంటే నమ్మరేంటి! అయినా మొదటి రాత్రి ఒక భార్యను భర్త అడగాల్సిన ప్రశ్నయేనా యిది?" కొంచెం కటువుగా ప్రశ్నించింది కళ్యాణి.

మాధవ్ కొంచెం కంగారు పడ్డాడు. "లేదు నేను ఊరికే అడిగాను. ఈ కాలంలో ప్రేమించడం, ప్రేమించబడటం జస్ట్ కామన్ అయ్యాయి కదా! అందుకని" ఆ తర్వాత ఆ రాత్రి తను యిక రెట్టించలేదు.

కొత్త కాపురం మొదలయింది. యిద్దరూ.. ఒకే జీవితంగా మసలడం ఎంత బావుంటుంది? ఒకరి కోసం మరొకరు ఎదురు చూడటం.. ఒకరి శ్వాసలో మరొకరు లీనం కావడం.. రెండు హృదయాలు ఒకటే ప్రేమ గీతం పాడటం.. నూరేళ్ళ దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని అంతా మూడు నెలల్లోనే పొందాలన్న తాపత్రయం కళ్యాణిది.

అతి సన్నిహితంగా వుండే సందర్భాలలో కొంచెం ఉద్వేగపడితే "యిదంతా నాకే తెలియదు. నీకెలా తెలుసు. పూర్వానుభవమా? చెప్పు! పర్లేదు! నేనేం అనుకోను" అనే వాడు కళ్యాణి మనసంతా జావకారి పోయేది. మొదటి రాత్రి మాధవ్‌లో మొలకెత్తిన ఆ చిన్న అనుమానం వాళ్ళ దాంపత్య జీవితంలో పాటుగా పెరిగి పెద్దదైవేళ్ళు సాచుకొని, ఊడలు దించింది.

మాధవ్ విపరీత మనస్తత్వం కళ్యాణిని మరింత బాధించింది. ఒక్కొక్కసారి వారం రోజుల పాటు ఇంట్లోంచి బయటకు కదిలేవాడు కాదు. ఒక్కొక్కసారి రోజుల తరబడి యింటికి వచ్చేవాడు కాదు. యింట్లో వున్న సమయంలోనూ, బయటకు వెళ్ళిన సమయంలోనూ, నిరంతరం నిఘా కళ్యాణి మాట మీద నిఘా.. మనసు మీద నిఘా.. ప్రవర్తన మీద నిఘా..

ఆరుగదుల యింట్లో.. ప్రతి గదిలో ఒక క్లోజ్డ్‌సర్క్యూట్ టి.వి. పెట్టి ఆమె ప్రతి కదలికనూ పరిశీలించేవాడు. బయటి నుంచి ఎవరెవరితోనో ఫోన్లు చేయించేవాడు.

ప్రతి రాత్రి ఆమెకు నరకమే! యాక్టివ్‌గా వుంటే ఒక మాట.. పాసివ్‌గా వుంటే మరో మాట. త్వరగా నిద్రపోతే ఒక మాట. నిద్ర పోకపోతే మరోమాట. "స్లీపింగ్ విత్‌ది ఎనిమీ" కళ్యాణి జీవితం.

ఆగ్రహమయినా.. అనుగ్రహమయినా భారీ స్థాయిలోనే వుండేది. "కళ్యాణి పద పద!" సంధ్యలోమంచి మూవీ! మనం ఖచ్చితంగా చూసి తీరాల్సిందే!" అంటూ బయల్దేర దీసేవాడు. మార్గ మధ్యలోనో.. థియేటర్లోనో ఏదో ఒక మాట మనిషిని గాయపర్చే మాట మాట్లాడి మూడంతా పాడుచేసేవాడు. మూడీగా వుంటే మళ్ళీ తిట్టేవాడు.

"అసలు మీరు యిలా ఎందుకు మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు.. నా ప్రవర్తన మీద మీకు అనుమానాలుంటే ఏ ఆధారంగా మీరు అనుమానాలు ఏర్పరచుకున్నారో చెప్పండి. నేను స్పష్టమయిన జవాబు చెప్తాను. అర్థంలేని ఆరోపణలతో అనుమానాలతో, యిద్దరి జీవితాలని ఎందుకు నరక ప్రాయం చేస్తారు?" కళ్యాణి గట్టిగా అడిగింది ఒకసారి.

"ఏ ఆడదయినా ఆధారాలు వదిలేసి చేసే పనులు చేస్తుందా! అందులో నీలాంటి నెరజాణ మరీ! యింత అందంగా వున్న నిన్ను ఎవడూ ప్రేమించలేదంటే.. ఎవడితోనూ నీకు సంబంధం లేదంటే నేను నమ్మను గాక నమ్మను. ఈ రోజు కాకపోయినా, మరో రోజయినా నేను ఈ మిస్టరీ ఛేదిస్తాను.

"ఛీ మీతో మాట్లాడటం అనవసరం"

"మొగుడితో మాట్లాడటం అనవసరమ్, యిష్టంగా మాట్లాడటానికి ఎవరో వుండే వుంటాడు. అవునా? కాదా?" ఆల్‌రోడ్స్ లీడ్ టూ రోమ్ అన్నట్లుగా ప్రతి సంభాషణా చివరకు అక్కడికే వచ్చి ఆగేది.

"నేను ఎ.జి.పి. కార్పోరేషన్లో జాబ్‌కి అప్లయ్ చేశాను. రేపే యింటర్వ్యూ వెళ్తాను" అంది కళ్యాణి ఒక రోజు.

"ఎ.జి.పి. కార్పోరేషనా, అందులో అయితే వద్దు"

"ఏం ఎందుకని?"

"నా కిష్టం లేదు!"

"ఎందుకిష్టం లేదో చెప్పండి"

"ఎందుకిష్టం లేదో చెప్పాల్సిన అవసరం నాకు లేదు. నేను వద్దు అంటున్నాను. అందుకని మానెయ్యి"

"మీరు కారణం ఏంటో చెప్తే మానేస్తాను. లేదంటే మాత్రం నేను వెళ్ళి తీరతాను.."

"ఆ యింటర్వ్యూకి వెళ్ళేట్లు యితే.. నువ్వు మళ్ళీ ఈ యింటికి రావాల్సిన అవసరం లేదు."

"మీరు కారణం ఏంటో చెప్పండి.."

"కారణం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పానా! భర్తగా నేను చెపుతున్నాను.. అంతే" కళ్యాణి మరి యిక మాట్లాడలేదు.

ఒక రోజు సివిల్స్‌కి అప్లయ్ చేస్తున్న అప్లికేషన్ ఫామ్ చూశాడు మాధవ్.

"ఏమిటది?"

"కన్పించడం లేదా! సివిల్స్ అప్లికేషన్ ఫామ్"

"కలెక్టరయి ఊళ్ళేలుదామనా! నీ మొహానికి అదొక్కటీ తక్కువ"

ఎన్ని కలలు కన్నది తను.. జీవితం తులసి ఆకు మీది ముందు బిందువులా సున్నితంగా వుండాలని ఎంతగా తపించింది తను. కానీ యిదేమిటి యిలాగ అయింది.

"కళ్యాణీ! ఇలా చాలా పెద్ద కాంట్రాక్ట్. దగ్గర దగ్గర మూడు కోట్ల రూపాయల విలువయిన కాంట్రాక్ట్సు యిది మనకు వచ్చిందనుకో మన లైఫంతా మారిపోతుంది. రెండేళ్ళ కాల పరిమితిలో ఈ ప్రాజెక్టు పూర్తి చెయ్యాలి. ఈ కాంట్రాక్టు మనం చేస్తే రెండేళ్ళలో మన జీవితం పూర్తిగ మారిపోతుంది. అందుకు నువ్వోపని చెయ్యాలి."

> **"కళ్యాణీ! ఇలా చాలా పెద్ద కాంట్రాక్ట్. దగ్గర దగ్గర మూడు కోట్ల రూపాయల విలువయిన కాంట్రాక్ట్సు యిది మనకు వచ్చిందనుకో మన లైఫంతా మారిపోతుంది. రెండేళ్ళ కాల పరిమితిలో ఈ ప్రాజెక్టు పూర్తి చెయ్యాలి. ఈ కాంట్రాక్టు మనం చేస్తే రెండేళ్ళలో మన జీవితం పూర్తిగ మారిపోతుంది. అందుకు నువ్వోపని చెయ్యాలి."**

"ఏంటది?"

"ఏం లేదు. జస్ట్ ఒక హాఫ్ యాన్ అవర్ నువ్వా డి.ఇ.తో గడపాలి అంతే,, అతను మనకు ఫేవర్ చేస్తాడు.

మాధవ్ చెంప చెళ్ళుమంది.

> **'ఏం లేదు. జస్ట్ ఒక హాఫ్ యాన్ అవర్ నువ్వా డి.ఇ.తో గడపాలి అంతే, అతను మనకు ఫేవర్ చేస్తాడు. మాధవ్ చెంప చెళ్ళుమంది.**

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్. నా గురించి ఏం అనుకుంటున్నావు. అసలు ఒక భర్త భార్యను అడగాల్సిన మాటేనా యిది. యింతకాలం నువ్వు. పెట్టిన హింస అంతా భరించాను. యింక నా వల్ల కాదు" దుఃఖం పొంగి పొర్లుతోంది. రెండేళ్ల నుండి అణచి పెట్టుకున్న దుఃఖం రెండేళ్ల నుండి లోపల్లోపల మౌనంగా సుడులు తిరుగుతున్న దుఃఖం రెండేళ్ళ నుండీ లోపల బడబాగ్నిలని దాచుకుని పైకి శాంత గంభీరంగా కన్పించే సముద్రంలా మనసు పొరల్లో దాక్కున్న దుఃఖం గట్టు తెంచుకుంది.

ఆ రోజు నుండి కళ్యాణి పూర్తిగా మారిపోయింది.

చదువు.. చదువు.. చదువు.. రోజుకు ఇరవై నాల్గు గంటలుంటే యిరవై గంటల పాటు కష్టపడింది. నిద్రాహారాలు మానేసి చదువే లోకంగా బ్రతికేసింది. కళ్యాణి ఎందుకలా పిచ్చి పట్టినట్లు చదువుతున్నదో మాధవ్‌కి అర్థం కాలేదు. కానీ ఏదో జరగబోతోందని అతనికి అర్థం అయింది.

ప్రిలిమ్స్ అయిపోయాయి. ఆ ఫలితాలు ఆమెలో మరింత పట్టుదలని పెంచాయి. మెయిన్స్ రిజల్ట్సు కూడా వచ్చాయి. కళ్యాణి ఆత్మ విశ్వాసం మరింత పెరిగింది. ఇంటర్వ్యూ అయిపోయింది రెండేళ్ల ట్రెయినంగ్. రక రకాల ప్రదేశాలు. రక రకాల మనస్తత్వాలు, డబ్బు కోసం కక్కుర్తి పడేవాళ్ళ, పేరు కోసం తాపత్రయపడే వాళ్ళు, ప్రపంచ ఎంత వైవిధ్య భరితంగా వుంటుందో అర్థం అయింది. రాజస్థాన్‌లో మొదటి పోస్టింగ్ బాగా వెనుకబడిన "జైసల్మేర్" జిల్లా, అహోరాత్రులు కష్టపడి మంచి పేరు తెచ్చుకుంది.

"ఆఫీసర్ విత్ టెండర్ హార్ట్" పత్రికలు ఆమెకు పెట్టిన ముద్దు పేరు. ఆమె ఖ్యాతి దిగంతాలకు పాకింది. అన్నింటా ముందుండే ఆంధ్రా హైటెక్ ముఖ్యమంత్రి కేంద్రంలో తన పలుకుబడి ఉపయోగించి ఆమెను డిప్యూటేషన్‌పై తెచ్చుకున్నాడు. అందరూ ఆడవాళ్లతో ఆయన ప్రయోగం చెయ్యదల్చుకున్నాడు. అదుకు ఆధారం ఆమె. ముఖ్యమంత్రి ఆశలను వమ్ము చెయ్యలేదు. నంబర్ వన్ జిల్లాగా అంతర్జాతీయ సంస్థలు రేటింగ్ యిచ్చాయి.

ఎన్ని విజయాలు సాధించినా ఆమెను ఒకే ప్రశ్న వెంటాడుతూ వస్తోంది. వీడని నీడలాగా.. ఆ ప్రశ్న, మీ వారేం చేస్తారు?

ఏ జవాబు చెప్పను? మరీ విజయం ఎలా సాధించారు? అంటే జవాబు చెప్తుంది. "మీకింత ఆత్మ విశ్వాసం ఏంటంటే! చెప్తుంది.

"మీ వారేం చేస్తారంటే?"

అసలీ ప్రశ్న స్త్రీలనే ఎందుకడగాలి! ఏ పురుషుడినీ "మీ ఆవిడేం చేస్తుంది? అని పట్టి పట్టి అడగరేం! చదువు రాని స్త్రీల దగ్గర్నుండి. ఐ.ఏ.ఎస్.ఐ.పి.యస్ ఆఫీసర్ల దాకా ఒకటే ప్రశ్న.

"మీ వారేం చేస్తారు?" అని

"ఏం ఏదయినా వారే చెయ్యాలా! ఏది చెయ్యడానికి అయినా పురుషుడే అర్హుడా? స్త్రీ ఏం చేయ కూడదా? అయితే వినండి.

"మా వారేం చేస్తారో తెలుసా! నన్ను చూసి అసూయపడతారు. నా విజయాలని చూసి ద్వేషపడతారు. నన్ను మనిషిగా గుర్తించడానికి అవమానపడతారు. నా వ్యక్తిత్వాన్ని, శరీరాన్ని తాకట్టు పెట్టి డబ్బు సంపాదించడానికి యిష్టపడతారు. తను కేవలం పురుషుడిగానే మిగిలిపోతే, నేను మనిషినయినందుకు అవమానంతో మరణిస్తారు.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

-నీలిమ

నాటి తరం వారి కథలు నేటి తరానికి

## కథల వంతెన

# భిక్షాందేహి

కథ

1988లో రాసిన కథ

హైదరాబాదు వెళ్లేబస్సు ప్లాట్ ఫారం మీదికొచ్చింది. బఠానీ, పల్లీ, పిపర్‌మెంట్, వాటర్ పాకెట్లు అమ్మే పిల్లల అరుపులతో కోలాహలంగా వుంది. హైదరాబాదు వెళ్లే ప్రయాణీకులు బుకింగ్‌లో టికెటు తీసుకుని బస్సెక్కి సీటు చూసుకుంటున్నారు. బస్సు ఎక్కింది మొదలు లోకాభిరామాయణం మొదలు నా ప్రక్కన ఓ ముసలాయన వచ్చి కూర్చున్నాడు. ముఖం మీద చెమటను పై పంచతో తుడుచుకొని చేతిసంచిని కర్రను పక్కకు పెట్టాడు. "బఠాణ, పిప్పరమెంట్, బిస్కట్లు" ఓ పిల్లవాడు బస్సంతా తిరిగిదిగి పోయాడు.

> **"మనలాంటి వాల్లిచ్చిన ఒకటీ అరా కూడబెట్టి సెంపుచేశాడు. వడ్డీలకు తిప్పి పదులను వందలు, వందలు వేలుగా చేశాడు. అదీ అతని తెలివి?"**

'బాబూ ధర్మం'

'ధర్మం చేయండిబాబూ'

'చేతుల్లేనోన్ని బాబూ'

'ధర్మ ప్రభువులు, ధర్మం చేయండి బాబూ

"హైదరాబాదు వెళ్లే తల్లులు, తండ్రులు, నాయినా ధర్మం చేయండి బాబూ'

"ధర్మం..."

సీటు సీటుకు తిరుగుతున్నాడు. అతని వైపు చూశాను. రెండు చేతులు లేవు. పాపం మోచేతి వరకు తెగిపోయాయి. వాటిని పైకెత్తి నమస్కరిస్తున్నాడు. దోవతి ఓ జేబున్న చొక్కా తొడుక్కున్నాడు. మనిషి నల్లగా బలంగా వున్నాడు. 45 ఏండ్లు వుండవచ్చు. మధ్య మధ్య పాటలు పాడుతున్నాడు. బ్రహ్మంగారి కాలజ్ఞానం చెబుతున్నాడు. అతని రెండు చేతులలా పోయాయో! పాపం చేతులు లేకుంటే నరకం. భగవంతుడు ఒక్క సారి చంపెయ్యకూడదూ. నా ముందు కూర్చున్న ఆడవాళ్లిద్దరు చేరో రూపాయి అతని జేబులో వేశారు. అతని జేబు గలగలలాడింది.

బాబూ ధర్మం బాబూ

చేతుల్లేనోన్ని బాబు

ధర్మం బాబు..

నా దగ్గరకు వచ్చాడు. ఓ రూపాయితీసి అతని జేబులో వేశాను. నా ప్రక్కన కూర్చున్న ముసలాయన అతని వైపు యమధర్మ రాజులా చూసి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. నా వెనకాల కూర్చున్నాయన ఈ భిక్షగాళ్ల గురించి సుదీర్ఘోపన్యాసం చేస్తున్నాడు. వీళ్లవల్ల దేశంలో సోమరితనం పెరిగిపోతుందని, దేశ ఆర్థిక పరిస్థితి దివాలా తీస్తుందని, ప్రతి వానికి ఇదో సులభ సంపాదనయిందని ఫారిన్ కంట్రీస్‌లో భిక్షుక వృత్తి నిషేదించారని ఏదో ఏదో ప్రక్కాయనకు చెబుతూనే వున్నాడు.

నా ప్రక్క ముసలాయనను చేతుల్లేని బిక్షగాడు ఎగాదిగా చూశాడు.

"ఎవరూ వెంకట్రావుగారా! ఓ సారి బయటకు వస్తారా!"

"ఆ ఆc బస్ బయలు దేరుతెందేమో! పద పద" అతని వెంట కిందకు దిగాడు.

ఈ ముసలాయనకతో వీనికేం పని? నాకు తోచలేదు. ఎదురుగా బుక్‌స్టాల్‌లో పేపరు కొందామని నేను కిందికి దిగాను. బుక్‌స్టాల్ ప్రక్కనే ట్యాంక్ వుంది. దాని ప్రక్కనే ముసలాయన ఆ మొండి చేతుల బిక్షగాడు ఏదోవాదించుకుం టున్నారు.

"నా బాకీ, అసలు, వడ్డీ ఎన్నాల్లయిందండి, నమ్మకస్తులని యిస్తే బలేచేశారండి"

"పిల్లవాని దగ్గర నుండి రాలేదయ్యా! రాగానే నీ బాకీ తీరుస్తాలేవయ్యా!"

నాకెందుకులే వీళ్ల గొడవ అనుకొని పేపరు తీసుకొని బస్సెక్కాను. బస్సు ఇంకా కదల లేదు. ఈ బస్సులు ఎప్పుడూ ఇంతే. కండక్టరుంటే డ్రైవరుండడు. ఇదీ వరస. నా ప్రక్క ఆసామి అతనికి అప్పుపెట్టి ఉండవచ్చు. కిందికి దిగి దబాయిస్తు న్నాడు అనుకున్నాను. పాపం చేతుల్లేని వాడు గదా, దయదలచి బాకి వదిలేయకూడదూ! ఈ ధనవంతులంతా ఇంతే!

నా ప్రక్క వెంకట్రావువచ్చి కూర్చున్నాడు. ముఖం మీద పట్టిన చెమట తుడుచుకున్నాడు. నెత్తి వెంట్రుకలు నెరిసి పోతున్నాయి. ఇంతలో బస్సు కదలనేకదిలింది. అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

"అతను మీకెంతివ్వాలి సార్"? అడక్కూడదను కుంటూనే అడిగాను.

అతను నావేపు అదోలా చూశాడు. అనవసరంగా అడిగానా అనుకున్నాను.

"ఏంటి మీరనేది"

"అదే.. ఇప్పుడు రాలేదండీ, ఆ మొండిచేతుల బిక్షగాడు మీదగ్గరెంత అప్పుతీసుకున్నారండి"

"నా దగ్గర అప్పా" చిన్నగా నవ్వాడు.

యిస్తావా! మా సంగతి నీకెందుకు అంటాడనుకున్నాను.

"నేనే అతనికివ్వాలి"

మీరా ఆ బిక్షగానికి అప్పుపడ్డారా! చిత్రంగా వుందే. ఎంతివ్వాలేమిటి?

"మూడు వేలు"

ఆc! యితను జోక్ చేస్తున్నాడా! కాకుంటే పైసపైస అడుక్కునే ఆ చేతుల్లేనోడు ఈయనకు అప్పియ్యడమేమిటి?

"అంతడబ్బతనికెలా వచ్చిందండి. అడుక్కుని బ్రతికేవాడు పాపం!" అన్నాను.

"గత సంవత్సరం నా కూతురు పెండ్లి చేయవలసి వచ్చింది. తీరా పెండ్లి సమయంలో మా వియ్యంకుడు పూర్తి కట్నంమిస్తేగాని పెండ్లి జరుగదన్నాడు. అంతకు ముందే ఓ పదివేలుయిచ్చా! ఓ మూడు వేలు తర్వాత యిస్తానన్న వూరుకోలేదు. ఈ మొండి చేతుల గోపాలం ఆపద్బాంధవుడిలా నిలిచాడు. రండి మాష్టారూ నేనిస్తానన్నాడు. యిచ్చి నా పరువు కాపాడాడు.

"వడ్డీ కాస్త ఎక్కువనుకోండి"

"ఏ మాత్రమేమిటి?"

"వందకు నెలకు పదిరూపాయలు"

"అమ్మో! సిటి మార్వాడి వడ్డి కంటె పెద్దది"

"మన అవసరం ఏం చేస్తాం!"

"అతను వూరికే యివ్వడు పొలమో, ఇల్లో, నగో ఏదో ఒకటి తాకట్టు పెట్టుకునిగాని ఇవ్వడు"

"ఇప్పుడు తగాదా ఎందుకొచ్చినట్లు? ఇవన్నీ అడుగుతున్నానని ఏమనుకోరుగదా!"

"యేముంది నాయినా, ఈ రోజుల్లో అప్పులు చేయని వాళ్లు ఎవరుంటారు చెప్పు. నెలనెలా అతనికి మూడు వందలు వడ్డీ బాపతుయివ్వాలి. వడ్డీయిచ్చి అసలివ్వకున్న కొంత కాలమాగుతాడు. నెలవడ్డీ మాత్రం ఇవ్వకుంటే ఇంటి ముందు బైఠాయిస్తాడు. వర్షాల్లేక పంటల్లేవు. పెట్టిన పెట్టుబడులే ఎల్లలేదు. మా పెద్దోడు హైదరాబాదులో కొలువు చేస్తున్నాడు. ఏమైనా సర్దుతాడేమోనని వెళుతున్నా!" వెంకట్రావుతన మనస్సులోని మాట విప్పి చెప్పాడు. నాకో ధర్మ సందేహం వచ్చింది. ఈ చేతుల్లేనోడు ఇంత డబ్బెలా సంపాదించాడు? ఏదైనా లాటరీ వచ్చిందా? ఎక్కడైనా గుప్త ధనం దొరికిందా? ఇదే మాట వెంకట్రావు గారిని అడిగాను.

"మనలాంటి వాల్లిచ్చిన ఒకటీ అరా కూడబెట్టి సెంపుచేశాడు. వడ్డీలకు తిప్పి పదులను వందలు, వందలు వేలుగా చేశాడు. అదీ అతని తెలివి?"

మనం నెలనెలా వేల జీతాలొస్తె మరీ ఫస్ట్‌తారీకు కొరకు చూస్తాం. ఈ మనిషి ఇంత ఏలా సంపాదించాడబ్బా! మళ్ళీ వెంకట్రావందుకున్నాడు.

"వాడెంతలేదన్నా రోజుకో వంద సంపాదిస్తాడు. అతని భార్య గుడ్డిది. ఆమె ఓ యాభయి రూపాయలు సంపాదిస్తుంది. ఈ బస్తీలో ఓ యిల్లుంది. దానికి కిరాయి ఓ రెండు వేలొస్తాయి. ఊళ్లో సగం మందికి అప్పులు పెట్టాడు. నెలా నెలా టంచనుగా వసూలు చేస్తుంటాడు."

"ఇంకొక ప్రశ్న రావుగారూ! అతని చేతులేలా పోయాయండి?"

"అదా, యస్.యల్.బిసి. కాల్వ త్రవ్వేటప్పుడు రాళ్లకు బరాలు పెట్టేవాడు. ఒక రోజు బర్మా చేతిలోనే పేలింది. రెండు చేతులు ఎక్కడపో యాయో దొరకలేదు. దవాఖానాలో కొన్నాళ్లుండి బాగయి బయటకు వచ్చాడు. ఆ చేతులున్న రోజుల్లో వాడెన్ని రౌడీ పనులు చేశాడని! వాటికి అంతేలేదు. భార్యాభర్తలు ఇద్దరు ఎప్పుడు కీచులాడుకునేవారు. ఇప్పుడు చూడు వాళ్లు చిలుకా గోరింకల్లా వున్నారు".

"ఇంకెందుకండి వీడికి ముష్టెత్తు కోవడం"

"అమ్మో! ఎన్ని మానినా దీన్ని మాననంటాడు"

> **'యేముంది నాయినా, ఈ రోజుల్లో అప్పులు చేయని వాళ్లు ఎవరుంటారు చెప్పు. నెలనెలా అతనికి మూడు వందలు వడ్డీ బాపతుయివ్వాలి. వడ్డీయిచ్చి అసలివ్వకున్న కొంత కాలమాగుతాడు. నెలవడ్డీ మాత్రం ఇవ్వకుంటే ఇంటి ముందు బైఠాయిస్తాడు.**

మనిషికి ఎంతవున్నా ఇంకా సంపాదించాలని ఆశ

అదేనేమో ఈ చేతుల్లేని గోపాలం ఆశ

బస్సు హైదరాబాదు దరిదాపుల్లోకి వచ్చింది.



-మేరెడ్డి యాదగిరిరెడ్డి
9949415798

## తెలివైన అమ్మాయిలు

సిద్దిపేట జిల్లాలోని బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కథలు

అనంతసాగర్ లో అనన్య, శరణ్య, శ్రీ పూజ, హారిక నలుగురు స్నేహితులు. రోజు నలుగురు కలిసి బడికి వెళ్లేవారు. తరగతిలో సార్లు చెప్పే పాఠాలను ముందే చదువుకొచ్చేవాళ్ళు. సార్ పాఠం చెప్పగానే టకటక సమాధానాలు చెప్పేవారు. తోటి పిల్లలకు పాఠం అర్థంకాకపోతే బాధపడేవారు. విశ్రాంతి సమయంలో వాళ్లకు చదువు చెప్పేవారు.

వెనుకబడిన పిల్లలు లేకుండా చేసేవారు. అందరికీ కూడా వీళ్ళు అంటే ఇష్టం. పాఠశాలలో ఏ ప్రోగ్రామ్స్ అయినా వీళ్లే ముందుండేవారు. ఎజెండా తయారు చేసుకునేవారు.

ప్రోగ్రామ్స్ చక్కగా నిర్వహించేవారు. వచ్చిన ఆఫీసర్లు అందరూ ఈ పిల్లల తెలివిని చూసి మెచ్చుకునేవారు. భవిష్యత్తులో వీళ్ళు ప్రయోజకులుగా అవుతారని చెప్పేవారు. ఈ నలుగురి పిల్లల్లో మరింత ఉత్సాహం పెరిగింది. ఎవరు బడికి రాకున్న వారి ఇండ్లకు వెళ్లేవారు. మీ పిల్లలను బడికి పంపించాలి. చదువుకోకపోతే భవిష్యత్తులో కష్టాలు ఉంటాయి. అందుకే నచ్చజెప్పి పిల్లలను బడికి తీసుకొచ్చేవారు. పాఠశాలకు దసరా పండుగకు సెలవులుఇచ్చేవారు. ఉపాధ్యాయులు విహార యాత్రలకు తీసుకెళ్లేవారు. ఈ నలుగురు అమ్మాయిలు కూడా వెళ్లేవారు. అక్కడ సార్లు చెప్పిన ప్రతి విషయాన్ని నోటు బుక్కులో రాసుకునే వారు. యాత్రలకు రాని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పేవారు. ఊరిలో మీటింగులు జరిగేవి. పెద్దలు చెప్పే మంచి విషయాలను నోట్ బుక్కు లో రాసుకునేవారు. ఎవరైన స్టేజి మీద కొచ్చి మాట్లాడాలి. అన్నప్పుడు నలుగురు అమ్మాయిలు వెళ్లి ఉపన్యాసం ఇచ్చేవారు. అందరి చేత ప్రశంసలు పొందేవారు.

వారి ఇళ్లల్లో నలుగురు అమ్మాయిల గురించి చెప్పేవారు. వారి లాగ మీరు చదవాలని తమ పిల్లలకు చెప్పుకునేవారు. ఈ నలుగురు అమ్మాయిలు డాక్టర్లు కావాలని అనుకున్నారు.

అమ్మానాన్నలు ఇచ్చేడబ్బులతో పుస్తకాలు కొనుక్కొన్నారు. పట్టుదలతో పెద్ద చదువులు చదివారు. అందరు డాక్టర్లు అయ్యారు. మంచి సేవలు అందించారు ఊరికీ ఆదర్శంగా నిలిచారు.

-జక్కుల శరణ్య
6వ, తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
బక్రిచెప్యాల. సిద్ధిపేట జిల్లా
9704865816.

## చిన్న చూపు

అనాథలైన రవి, రమ్య వీరు అన్నా చెల్లెళ్లు..ఆకలి వేస్తే అన్నం దొరికేదికాదు. పడేసిన పాతబియ్యపు సంచులను జబ్బకు వేసుకొని ఊరంతా తిరిగేవారు. రోడ్ల పక్కన తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, కవర్స్ ఏరుకొనేవారు. సాయంత్రం వాటిని అమ్మి వచ్చిన డబ్బులతో ఆ పూటకు అన్నం తినేవారు. ఒక్కొక్క రోజు అన్నమే దొరికేది కాదు. పస్తులతో గడిపేవారు. ఒకరోజు పాఠశాల వైపు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు ఏరుకుంటున్నారు. అటు ప్రక్కగా ఇద్దరు అన్నాదమ్ముళ్లు సతీష్, నితీష్ స్కూల్ డ్రెస్, బ్యాగు వేసుకొని బడికి వెళ్తున్నారు.

రవి, రమ్యను చూసి"నితీష్! ఛీ!ఛీ!మురికి పిల్లలు. వాళ్లను ముట్టుకోకు"అని అన్నను అంటాడు. అప్పుడు రవి మేము మీలాగా ధనవంతులం కాకపోవచ్చు. కానీ మా పరిస్థితి వల్ల ఇలా అయ్యాం. లేకపోతే మీలాగా మేము కూడా బడికి వెళ్లి చదువుకునే వాళ్ళమని హెచ్చరిస్తాడు. వాళ్ళు అక్కడి నుండి వెళ్లిపోయారు. రమ్య వాళ్ళు ఇంటి దగ్గరికి వచ్చేసరికి చీకటి పడింది. తినడానికి ఏమి దొరకలేదు. పక్కింటి వారింటికి వెళ్లి అన్నం అడిగింది. లేదనగానే రమ్య ఏడ్చుకుంటూ అన్న దగ్గరకు వెళ్ళింది. రవి 'ఎందుకు ఏడుస్తున్నావ్ రా! చెల్లి' అని అడిగాడు. ఈ ఒక్క పూట ఆకలికి ఓర్చుకో. రేపు ఎక్కడనైనా పని చూస్తాను. ఆ పనికి మనం రోజు వెళ్దాం. అప్పుడు రోజు కడుపునిండా అన్నం తిందాం అని ధైర్యం చెప్పాడు. వారిద్దరు ఆకలితో మంచినీళ్లు తాగినిద్రపోయారు.

మరుసటి రోజు ఇద్దరు హోటల్ యజమానిని కలిసారు. ఏమైనా మాకు పని ఇప్పియ్యండి సార్ అని అడిగారు. ఏ పని చేస్తారు మీరు. చూస్తె చిన్న పిల్లల్లా ఉన్నారు అని అన్నాడు. ఏ పనైనా చేస్తాం అని రవి, రమ్యలు అన్నారు. సరే కొన్ని రోజుల వరకు తినుకుంటూ ఇక్కడే ఉండండిఅని అన్నాడు. ఒకరోజు హోటల్ యజమాని వీరిద్దరిని పిలిచాడు."ఎందుకమ్మా మీకు ఈ పరిస్థితి చదువుకోవడం లేదా!" అని అడిగాడు. లేదండి! మాకు అమ్మానాన్నలు లేరు అని కన్నీళ్లు పెట్టుకున్నారు. మిమ్మల్ని నేను చదివిస్తాను.

బడికి పోయి వచ్చిన తర్వాత మీకు చేతనైన పని చేయండి అని యజమాని అంటాడు.

ఇద్దరు సంతోషంగా ఎగిరి గంతులు వేస్తారు. ఆరోజు నుండి ఇద్దరికి పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, కొనిచ్చి బడికి పంపాడు.

వీరిద్దరూ కష్టపడి చదువుకుంటున్నారు. చూస్తుండగానే రవి, రమ్య పెద్దగయ్యారు.

వీరిద్దరికీ ఉద్యోగాలు దొరికాయి. చాలా సంతోషపడ్డారు. యజమాని ఆశీస్సులు పొంది ఉద్యోగాల్లో చేరిపోయారు. చిన్నప్పుడు స్కూల్ కు వెళ్తున్నప్పుడు ఎగతాళి చేసిన సతీష్, నితీష్ కలిశారు. తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులతో జల్సాగా తిరిగారు. చదువును అశ్రద్ధ చేశారు.

ఎక్కడ పరిస్థితులు అనుకూలించలేదు. చివరికి రవి పనిచేస్తున్న ఆఫీస్ కు వచ్చారు. రవి వారిని గుర్తుపట్టాడు. చూశారా! మిత్రులారా! విధి ఏవిధంగా మారుస్తుందో తెలిసిందా! అనగానే సిగ్గుతో ఆ మిత్రులు తలదించుకున్నారు. చివరికి రవి వాళ్ల ఆఫీసు లోనే వారికి గుమాస్తాలుగ పని పెట్టించాడు.

-సంకటి సిరిచందన
8వ, తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
బక్రిచెప్యాల సిద్ధిపేట జిల్లా. 9704865816

## మదిలోని భావాలేవో

గలగలపారే సెలయేరులా
మత్తకోయిల కూజితంలా
పురివిప్పిన నెమలి నాట్యంలో
కొలనులో విరిసిన కలువల్లా
మండువేసవిలో విరిసే మరుమల్లెల్లా
నోరూరించే తీయని నూజివీడు రసాల్లా
నల్లని కురిసే మేఘంలా
జలజల కురిసే వర్షంలా
భూమాత కౌగిలిలో ఒదిగే చినుకుల్లా
ఆకాశంలో విహరించే విహంగంలా
చల్లగ వీచే పిల్లగాలిలా
ఎత్తుకు ఎగిరే గాలిపటంలా
నీటిచెలమలో ఊరే ఊటలా
కడలిలో ఎగిసిపడే అలల్లా
నా మదిలో భావాలేవో ఊటలూరుతూ
తరంగాలై ఎగిసెగసి పడుతున్నాయి
కలంలోని సిరాను ఆసరాగా చేసుకుని
తెల్లని కాగితంపై నక్షత్రాలవోలె
మిలమిలా మెరిసిపోతున్నాయి
అక్షరాల విత్తుల మొలకలు
నా కనులముందు
నాట్యం చేస్తున్నాయి



-దేవలపల్లి సునంద
9291599562

## మినీ కవితలు

అనుకుంటే
నువ్వే వ్యక్తివి
మార్చుకుంటే
నువ్వే శక్తివి

డ్రగ్స్ మత్తులో
తారలు
సినీ లోకంలో
మబ్బు తెరలు

చెరవాని చేతిలో
గాలం వృథా
విలువైన
కాలం

గురి
తప్పెను తూటా
సూటి గా
పేలును మాట

సహనాన్ని
పెంచుకో
సమస్యని
తెంచుకో

నేడు అన్నీ
నెట్టింట్లో
సంసారాలు
వాకిట్లో

అవినీతి
ఆకాశంలో
అభివృద్ధి
పాతాళంలో

ఆశలు
పెట్టె నేతలు
ఆచరణకు
రాని చేతలు



-శ్రిష్టి శేషగిరి
9290652632

# రంజాన్ పండగ ప్రాశస్త్యం

రంజాన్ పండగ అంటే శుభవేళ. ఉత్సవ సమయమని అర్థం. పండుగలు మన జనజీవన స్రవంతిలో భాగమై జాతీయతకు, సంస్కృతి, సంప్రదాయాల వికాసానికి దోహదం చేస్తాయి. అన్ని మతాల పండుగలు వెనుక ఒక సందేశం ఉంటుంది. పండగలు హితాన్ని బోధిస్తాయి ముస్లింలు చాంద్రమాన క్యాలెండర్ను అనుసరిస్తారు.

రంజాన్ ను "రమదాన్ "అని పిలుస్తారు. ముస్లింల ఉపవాసాలు ముగింపు రోజే రంజాన్ పండుగ. దీనినే ఈద్ -ఉల్ - ఫితర్ అంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగ రంజాన్ . ఉపవాస ఉండటానికి వీల్లేని షవ్వల్ మాసంలో మొదటి రోజు. అంతేకాక ఒకే ఒక రోజు కూడా. ఈద్ షవ్వల్ మాసం తొలిరోజు అవుతుంది.

చాంద్రమాన హిజ్రీ తేదీలు స్థానికంగా చంద్రోదయం పై ఆధారపడి ఉండటంతో స్థానిక మతాధిపతులు నెలవంక కనిపించడంపై ఈ పండుగను ప్రకటిస్తారు ముస్లింలందరూ సామూహికంగా ప్రార్థనలు చేస్తారు.

మతమేదైనా ఎవరి సంప్రదాయాల ప్రకారం వారు పండగలు జరుపుకుంటారు. ఉన్నవాళ్ళకు ప్రతిరోజు పండగే. కాని బీద, బిక్కి మధ్యతరగతి ప్రజలకు పండుగ రోజే పండుగ. కనుక ఇంటిల్లిపాదికలిసి చాలా సంతోషం గా జరుపుకుం టారు.

చాంద్రమానాన్ని అనుసరించి ఇస్లామిక్ క్యాలెండర్ 9వ నెల 'రంజాన్'. దీన్ని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈరోజు "దివ్య ఖురాన్" ఆవిర్భవించిన రోజు రంజాన్ పండుగ ముస్లింలు జరుపుకుంటారు. క్రమశిక్షణ దానగుణం ధార్మిక చింతన కలయికే రంజాన్ అమావాస్య తర్వాత వచ్చే నెలవంకను చూసిన తర్వాత రంజాన్ ప్రారంభిస్తారు రంజాన్ ను పవిత్ర మాసంగా పరిగణిస్తారు ఈ నెల రోజులు ఉపవాసాలు ఉండి రంజాన్ పండగ జరుపుకుంటారు.

ఈ సమయంలో ముస్లింలు ఆహారం మరియు పానీయం కాకుండా మద్యపానం ధూమపానం ఇతర భోగాలకు దూరంగా ఉంటారు ఖురాన్ ను అధ్యయనం చేస్తారు తెల్లవారుజాము నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉంటారు.

ఇస్లాంలో ఉపవాసాలు రెండవ శకంలో ప్రారంభమయ్యాయంటారు. మహమ్మద్ ప్రవక్త మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసిన సంవత్సరం తరువాత ముస్లింలు ఉపవాసాలు చెస్తున్నారం టారు.

తెల్లవారుజామున నుండి సూర్యాస్త మయం వరకు ఉపవాసం ఉంటారు. ఈ భోజనాన్ని సుహాల్ అని, సూర్యాస్తమయ సమయంలో విరమించే దానిని 'ఇఫ్తార్' అంటా రు. దీనిని సూర్యాస్తమయ వేళను బట్టి నిర్ణయిస్తారు.

ఆరోగ్యవంతమైన ముస్లింలందరూ ఉపవాసం తప్పనిసరిగా చేస్తారు. పిల్లలు వృద్ధులు శారీరకంగా మానసికంగా ఉపవాసాలు తట్టుకోలేనివారు కూడా తమ శక్తి కొలది ఉపవాసాలు ఉంటారు.

ఇఫ్తార్ కు ఇతర మతస్థులైన స్నేహితులను కూడా పిలుస్తారు. అందరూ సంతోషంగా విందును స్వీకరిస్తారు ఉపవాసం విరమించేటప్పుడు ఖర్జూరాన్ని తింటారు.

ఆదాయం ఉన్నా లేకున్నా శక్తి కొలది దానధర్మాలు చేస్తారు సంపన్నులైనా కాకుండా ఉండాల్సింది దానగుణం ఇతరులకు సహాయం చేయాలను కున్న వారు ఖురాన్ లో చెప్పినట్టు 'జకాత్' ఆచరిస్తారు. సంపాదనలో కొంత భాగం పేదలకు దానాలు చేస్తారు.ఆర్థికంగా లేని వాళ్ళు ఈ పండుగను సంతోషంగా జరుపుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

జకాత్ తో పాటు ఫిత్రాదానానికి రంజాన్ నెలలో ప్రాముఖ్యంవుంది. "అన్నార్తులు అనాధలుండని ఆ నవయుగమదెంతదూరమో" అన్న దాశరథి మాటలు ప్రకారం ఇంకా ఇలాంటి వాళ్ళు మన భారతావనిలో అనేకులు. అలాంటి వారికి చెసే దానాన్ని 'ఫిత్ర' అంటారు.

హిందువులు పాపప్రక్షాళనకై గంగలో మునిగితే పాప ప్రక్షాళన జరుగుతుం దన్న నమ్మకం ఉన్నట్లు, పేదలకు దానం చేయాలని తాము చేసిన చెడు నశించిపోతుందని వీరి నమ్మకం.

హిందువులు కూడా దాన, ధర్మాలు చేస్తారు.

క్రీస్తు పుట్టిన రోజు క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు కూడా తమ సంపాదన నుండి కొంచెం దానం చేస్తారు.

"సొంత లాభం కొంతమానుకొని పొరుగువారికి తోడ్పడవోయ్" అని గురుజాడ వారన్నట్లు, ఏ మతం వారైనా ...ప్రతి ఒక్కరు ఇతరులకు సాయం చేసే గుణాలను అలవర్చుకోవడమే లక్షణమై ఉన్నప్పుడుకొందరి ఆకలి తీర్చిన వాళ్లమవుతాం.

ముఖ్యంగా ఈమాన్, నమాజ్ రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాం మతానికి మూల స్తంభాలు . ఈ ఐదు సూత్రాలను ముస్లింలు రంజాన్ మాసంలో పాటిస్తారు

ముస్లింలు రంజాన్ సమయంలో ఎలాంటి చెడును మనసులో రానివ్వకూడదనుకుంటూ కల్మ తైప చదవడం పాపాల గురించి పశ్చాత్తాపం స్వర్గ ప్రాప్తి కావాలని కోరిక నరకం నుండి కాపాడమని విన్నపం చేస్తూ ముస్లిం లు అల్లాను వేడుకుం టారు.

"సొంత లాభం కొంతమా నుకొని పొరుగువారికి తోడ్పడ వోయ్" అని గురుజాడ వారన్నట్లు, ఏ మతం వారైనా ...ప్రతి ఒక్కరు ఇతరులకు సాయం చేసే గుణాలను అలవర్చుకోవడమే లక్షణమై ఉన్నప్పుడుకొందరి ఆకలి తీర్చిన వాళ్లమవుతాం.

ఈమాన్ : లాయిలాహ ఇల్లల్లాహ్, మహమ్మద్ రసూల్ అల్లా అని అల్లా తప్ప వేరే దైవం లేదని ముస్లింల నమ్మకం.

**నమాజ్ :** ముస్లింలందరు చిన్న, పెద్ద ఆడ, మగ అనే బేధాలు లేకుండా ప్రతి రోజు ఐదు పూటల నమాజ్ చేయాలన్నది ఇస్లాం ఆదేశం.ఇక రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష పాటించేవారు వీటితో పాటు 'తరావీ' నమాజ్ లకు హాజ రవుతారు. మూడు రోజులనుండి విధిగా ముప్పది రోజులపాటు ఖురాన్ లోని ముప్పది పర్వాలను మసీదులోఇమామి లు చదివిస్తారు.

**ఉపవాసం :** రంజాన్ మాసంలో ఆరోగ్యంగా ఉన్న ముస్లింలంతా కఠోర ఉపవాసం ఉండాలని ఇస్లాం బోధిస్తుంది. తెల్లవారుజామునందు సహర్ చేసి సూర్యాస్తమయం వరకు సుమారు పద్నాలుగు గంటలు పచ్చి మంచినీళ్ళు కూడా తాగకుండా ఉపవాసం ఉంటారు.

సూర్యాస్తమయం సమయంలో ఉపవాసం విరమిస్తారు సూర్యుని గమనాన్ని బట్టి ఉపవాస వేళలు మారు తుంటాయి. సౌమ్ (ఉపవాసం) ఖురాన్ ప్రకారం రమ ధాన్ నెలలో విధిగా ఉపవాసం ఆచరించా లన్నది నియమం ఉంది. ఈ ఉపవాసాన్ని పార్శీ భాషలో రోజా అని అంటారు 'సౌమ్' అని అరబ్బీలో పిలుస్తా రు.

జకాత్ తో పాటు ఫిత్రాదానానికి రంజాన్ నెలలో ప్రాముఖ్యంవుంది. "అన్నార్తులు అనాధలుండని ఆ నవయుగమ దెంతదూరమో" అన్న దాశరథి మాటలు ప్రకారం ఇంకా ఇలాంటి వాళ్లు మన భారతావనిలో అనేకులు. అలాంటి వారికి చెసే దానాన్ని 'ఫిత్ర' అంటారు.

**జకాత్:** ముస్లింలందరూ తమసంపా దనలో కొంత భా గాన్ని పేదల కోసం ఖర్చు చేయడాన్ని జకాత్ అంటారు. రంజాన్ మాసంలో ముస్లింలు తమ ఆదా యంలో రెండున్నర శాతం ధనాన్ని తప్పనిసరిగా పేదలకు ఖర్చు పెట్టాల ని చెబుతోంది ఖురాన్ .

వచ్చిన ధనంతో సంస్థలు పేదలకు ఆహారం దుస్తులు వైద్యం అందిస్తాయి కూడా ఈ పండుగను సంతోషంగా జరుపుకునేందుకు జకాత్ ఉపయోగపడుతుంది,

హజ్ : ఇక మక్కా యాత్రను ముస్లింలు పరమ పవిత్రంగా భావిస్తారు. సౌదీ అరేబియాలోని మక్కాను దర్శించుకోవాలని ఇస్లాం బోధిస్తుంది.

హిందువులు కాశీకి ,ముస్లీములు మక్కాకు,

క్రైస్తవులు జరూసలం జీవితంలో ఒక్కసారైనా వెళ్ళాలనుకుంటారు.

పండగలు మానవుల్లో మానవీయ విలువలను పరస్పర ప్రేమానురాగాలను, పరోపకార గుణాన్ని పెంపొం దిస్తాయి. సహనం, త్యాగం, కరుణ, సాను భూతి భావాలను అంది స్తుంది. ఇతరు లకు సహా య పడడంతో సమాజంలో సమా నత్వం, సోదర భా వం, సామరస్య వా తావరణాన్ని సూచిస్తుంది.

పండగలు మానవుల్లో మానవీయ విలువలను పరస్పర ప్రేమానురాగాలను, పరోపకార గుణాన్ని పెంపొం దిస్తాయి. సహనం, త్యాగం, కరుణ, సాను భూతి భావాలను అంది స్తుం ది. ఇతరు లకు సహా య పడడంతో సమాజంలో సమా నత్వం, సోదర భా వం, సామరస్య వా తావరణాన్ని సూచిస్తుంది.

పండుగలు పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకుంటారు. ప్రార్థన అనంతరం అందరూ ఈద్ ముబారక్ (శుభాకాంక్షలు) చెప్పుకుంటారు. పండగకు ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలను కుల,మత తేడాలు పాటించక స్నేహి తులందరికీ పంచు తారు. అందరు కలిసి సామూహి కంగా ఆరగిస్తారు. బంధువులు ,మిత్రుల కలయికతో మానసికానం దం కలుగుతుంది.

మతసామరస్యమే మనుగడకు సోపానం.

భిన్నత్వం లో ఏకత్వం కలిగిన మన భారతావనే అందుకు నిదర్శనం.



-డా॥బండారి సుజాత
9959771228



అంశం: " దాంపత్యం"

2024 నుండి "అమరావతి సాహితీ మిత్రులు" ఫేస్బుక్ వేదికగా కవిత్వం వర్క్ షాప్ లు మొదలయ్యాయి. నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. 2025 నుండి ఈ వర్క్ షాప్ పోటీలలో వచనకవిత /గేయం/ ఐదు పద్యాలు/ ఐదు మినీ కవితలు ... ఇలా ఏదో ఒక ప్రక్రియలో పాల్గొనవచ్చు...2025 లో "వారం వారం కవితల వర్క్ షాప్ 8" కోసం తమ కవితల్ని 25 మంది పంపించారు. వాటి నుండి 11 ఉత్తమ కవితలు ఎంచుకొనడం జరిగినది. .

## మినీ కవితలు

### షష్టిపూర్తి

వాళ్ల పవిత్ర బంధానికి
మూడు ముళ్ళు
ఏడు అడుగులు
సరిపోలేదు!
అందుకే, మళ్లీ
పెళ్లి చేసుకున్నారు!!

### నమ్మకం

నమ్మకమనే
పునాదులపై
ఇల్లు నిర్మించారు!
ఎన్ని భూకంపాలొచ్చినా
చెక్కుచెదరకుండా
ఉంటూనే ఉంది!!

### అన్యోన్యం

ఏకంగా
ఇంటి ముందు
ఓ గుమ్మడి తోటను
పెంచినా చాలదేమో ...
దిష్టి తగిలేంత
అన్యోన్యం
ఆ దంపతులది!

### పెత్తనం

ఎవరికివారు
ఆధిపత్యాన్ని
ఓడించారు!
జంటగా
దాంపత్యాన్ని
జయించారు!!

### బంధం

వెలుగును
ప్రసరించే సూర్యుడు ...
వెన్నెల
కురిపించే జాబిలి!
లోక కళ్యాణానికే కదా
ఈ రేయింబగళ్ళ
బంధం!!

-ధనుంజయ రెడ్డి

## మినీ కవితలు

### ఆదర్శ దాంపత్యం..

ఇన్ని సంవత్సరాలలో
ఆమె అతన్నెప్పుడూ
మోసం చేయలేదు..
ఎన్ని కష్టాలున్నా
అతనెప్పుడూ
ఆమెను వదలలేదు...
రైతుది మట్టిది
ఆదర్శ దాంపత్యం.

### భార్య

అతని
జీవన ప్రయాణంలో
ఎన్ని మలుపులో...
ప్రతి మలుపులోనూ
తోడున్నది..
అతని నీడ మాత్రమే..

### మూడు ముళ్ళు

అపార్థాన్ని
అనుబంధం గెలిచింది.
ఒంటరితనాన్ని
ఓదార్పు గెలిచింది.
నిస్సహాయతను
నమ్మకం గెలిచింది....

### కార్యేషు...

అలసి వస్తున్న
సూర్యుడికి,
విశ్రాంతి కోసం
అరుణ తివాచీలు
పరిచింది.
సంధ్యాదేవి.

### ఆజన్మాంతం

చితిలో
కాలుతున్న
అతను
ఉలిక్కి పడి లేచాడు.
తను లేకుండా
తానెలా ఉంటుందో అని....

### అలారం

అతనింకా
నిద్ర లేవలేదు.
అతని
అలారానికి
నిన్నటితో
కాలం చెల్లింది.

-జ. శివ కుమార్ .

దాంపత్యం అంటే
రెండు జీవితాలు
పెనవేసుకున్న కొత్త వేరు,
దాంపత్యం అంటే
రెండు నమ్మకాలు
ముడివేసుకున్న గుండె పేరు,
దాంపత్యం అంటే
రెండు మనసులు
కట్టుకున్న కుటుంబం అనే కొత్త ఊరు...
ఒక సంస్కృతిని
కొంగుముడిగా వేసుకుని,
మరొక సంస్కృతి చెంత
ఆ ముడి విప్పుకుని,
నూతన దాంపత్యం మొదలవుతుంది...
ఇక్కడ... భార్య రూపంలో
అమ్మ మరోసారి పుడుతుంది,
ఇక్కడ... భర్త రూపంలో
నాన్న మరోసారి పుడతాడు,
ఈ పునర్జన్మల సంగమంతో....
తరతరాలు చెప్పుకునే అనురాగం దాంపత్యం...
దాంపత్యంలో
ఎన్నో ధర్మాలు
మరెన్నో ఆచారాలు
ఇంకెన్నో విలువలు
భిన్నత్వం నుండి ఏకత్వానికి పయనిస్తాయి,
ఈ ఏకత్వం
ఒక ఇంటి నుండి మొదలయ్యి
కులం, గోత్రం, సమాజం
ప్రపంచంగా మారుతుంది...
అందుకే
దాంపత్యం ఒక గొప్ప సంస్కారం,
కానీ... నేడు
మూడు ముడులు పడుతున్నా....
మనసు ముడి పడటంలేదు,
సహజీవనాలే తప్ప
సమాగమనం సాధ్యమవటం లేదు,
రాత్రి మొగుడు
పగలు పెళ్ళాం
పేరిట సాగుతున్న కొత్త లోకానికి....
దాంపత్యం దారుల్లో...
దంపతులుగా నడిచే
క్షణాల సౌందర్యం తెలియటం లేదు,
అందుకేనేమో....
ఈ నాటి కుటుంబాలకి దాంపత్యం..
దూరపు బంధువు కూడా కాకుండా
మిగిలిపోతుంది.

-శ్రీఅరుణంశ్రీనివాస్ .

## గేయం

రెండు తనువులా
రాగ మొక్కటై...
రెండు మనసులా
గాన మొక్కటై..

ఓడి గెలిచినా
గెలిచి ఓడినా...
ఓట మొక్కటై
విజయ మొక్కటై..

ఇరు మనసులలో
భావ మొక్కటై..
ఇద్దరు మనుషుల
ధ్యేయ మొక్కటై...

ఇరువురిని కలిపే
బంధ మొక్కటై
కష్ట మొక్కటై
కరుసు ఒక్కటై..

అర్ధ మొక్కటై
అర్ధ మొక్కటై...
పలకరించు
ప్రతిబింబ మొక్కటై..

నాలుగు కన్నుల
భాష ఒక్కటై..
నాలుక పలికే
భావ మొక్కటై..

వేసే అడుగుల
నడక ఒక్కటై..
నదుస్తున్న
ఆ దారి ఒక్కటై.

కోప తాపముల
తీరు ఒక్కటై..

శాంతి చర్చలకు
చంద్రుడొక్కడై..

హెచ్చు తగ్గులా
నిచ్చె నొక్కటై..
తప్పొప్పులకు
తగువు ఒక్కటై...

నడిచే నడకల
నడత ఒక్కటై..
జగడపు గొడవల
తీరు ఒక్కటై...

ఎలపట దాపట
శక్తు లొక్కటై..
లాగే బండికి
ఇరుసు ఒక్కటై..

ఇద్ద రొక్కటిగ
ఒక్క రిద్దరుగ..
వడిదుడుకులను
ఒడుపు తెలిసి
గెలుపొందాలి...

సాగే రథముకు
సారధులై..
సంసార నావకు
నావికులై..

దాంపత్యంలో
దంపతు లిద్దరు..
కలకాలం
కలిసుండాలి.

- మేడిశెట్టి యోగేశ్వరరావు..

కాదది మూడు ముడులతో కలిపిన
పసుపు తాడు బంధం,
దంపతుల ఇరువురి
తనువులను తలపులను
ఏకం చేసి, పట్టి ఉంచే
పవిత్ర బంధం దాంపత్యం!.
బతుకు వేదికలపై,
పలు పాత్రల నడుమ
రెండు మనసులు కలిసి,
రసవత్తరంగా పండించే జీవన
నాటకానికి,
మూల కథేగా
అన్యోన్య దాంపత్యమ్!.
అనురాగాలు అభిమానాలు,
బంధాలు, అనుబంధాలును
సమిధలుగా వేస్తూ ,
జీవితమనే యాగశాలలో
చేసే పవిత్ర యాగం
అరమరికలు లేని దాంపత్యం.
దాంపత్యం, నమ్మకాలతో నిండిన
ఆప్యాయతాభిమానాల
అమృతకలశం!.
అపార్థాలు, అనుమానాలు,
అపనమ్మకాలనే అడ్డంకుల
అంధకారాలు కమ్ముకున్నా
అధిగమించి, అర్థం చేసుకుంటూ
కలకాలం కలిసి బతకండని
బతుకుకి
అర్థం చెప్పేదే దాంపత్యం!.
యే రెండుపక్షులు, యే గూటిలో
బతకాలో ఎవరికి మాత్రం ఎరుక!
ఏ రెండు తనువులు,
మూడు ముళ్లతో ముడిపడతాయో,
ఆ లలాట లిఖిత లిపికేగా ఎరుక!

-బంధకవి శ్రీనివాస రామారావు

సంసారిక జీవితానికి ఆది
సరికొత్త జీవనానికి పునాది
సంస్కృతి సంప్రదాయాల వారధి
వారసత్వ పరిమళాల రథసారథి దాంపత్యం.
కాపురాల కొలిమిలో పొగలకు
బ్రతుకు పయనంలో "పగ"లకు
నెరవదు ఎన్నడూ దాంపత్యం,
కష్టాలకన్నీళ్లను కనబడకుండా తుడిచే
మమతల కొలువులో వలపుల వాన దాంపత్యం.
బ్రతుకు దారిలో
త్యాగాల కొమ్మకు కాసిన సంతాన సిరి
జాతి సిగలో మెరిసినప్పుడు
ఆనందంలో పొంగి పొరలే కన్నీటి గోదారి దాంపత్యం.
సంసార సాగరంలో
కలల అలలు తీరం చేరినట్లే చేరి
చేజారి పోతుంటాయి



విమర్శల గాలులు చుట్టుముడుతుంటాయి
అయినా... అదరదు బెదరదు
కష్టాల తీరంలో సుఖాల జాతర దాంపత్యం.
నవ నాగరికత ఏ విషం చిమ్మిందో
పెంపకం పెడ ద్రోవ పట్టిందో
అహం కుంపటిలో
నేటి దాంపత్యం రగిలిపోతుంది
విలువలకు వలువలు ఊడపీకి
న్యాయస్థానాలు చుట్టూ దాంపత్యం పరిభ్రమిస్తోంది

- జాగరాపు శంకరరావు

## వచన కవితలు

దాంపత్య జీవితాన్ని
దేవుడిచ్చిన వరమంటూ
సుమాల వనమాలలా
పరిమళాలు వెదజల్లుకో!.
సహచర్యాన్ని పూర్తిగా
మమైకం చేసుకో!
అనురాగం కలబోసి
హరివిల్లుగా మార్చుకో!.
చిన్ని చిన్ని కలత లన్నీ
సర్దుబాటు చేసుకో!
కోపాల ఆవేశాలను
సరిగమలుగ దిద్దుకో!.
ద్వందాల ననుభవిస్తూ
ఆవల తీరం చేరుకో!
దాంపత్య పరమావధి
విశ్వ నిర్మాణ మని తెలుసుకో!
మమకారపు ఎరువులతో
సంసారం వృద్ధి చేసుకో!
ప్రమిదలాగా మారి
రమణీయ కాంతి విరజిమ్ముకో!

-సత్యవతి చల్లా

వసంతంలో
వాటేసుకుని ఉండటమే కాదు
శిశిరంలో కూడా
చిగురుల ఊహలతో
కలిసిమెలిసి ఉండేదే దాంపత్యం.
సయ్యాటల్లో
ముద్దులాటల్లో తేలియాడటమే కాదు
కీచులాటల్లో కూడ
గెలుపోటములెంచకుండా
క్రీడా స్ఫూర్తితో ఉండేదే దాంపత్యం.
ఆనందాల్లో
సరసాలు, మురిపాలు
పంచుకోవటమే కాదు
దుఃఖాల్లో కూడా
పాలు పంచుకుంటూ
దూరమవకుండా ఉండేదే దాంపత్యం.
సంసారంలో
పెంపకాలు,
పంపకాలు సరిచూసుకోవటమే కాదు
నిస్సార వేళల్లో కూడా
నిండు మనసుతో
ఒకరినొకరు సరిచేసుకుంటూ ఉండేదే
దాంపత్యం.
ఒక్కరిద్దరుగ మారి
ఇద్దరు ముగ్గు రవాలని
కలలు కనటమే కాదు
కలిమిలేములలో కూడా
ఒకరికొకరుగా
నలుగురిలో నగుబా టవకుండా ఉండేదే
దాంపత్యం.

-గోలి.

దంపతులం మనమే.
దాంపత్యం మనదే.
చీలిపోతే కూలిపోతమని,
విడిపోతే పడిపోతామని,
సంసారం ఒక సర్దుబాటని,
ఇద్దరమూ ఒప్పిన సంగతి
నీ నోటిలో తాంబూలం
నా నోటిలో పండింది.
నువ్వు కష్టపడుతుంటే
చెమటను నే నయ్యాను.
కూడు లేని రోజుల్లో
వాడిపోయి బ్రతికాము.
పంచభక్ష్యా లున్న నాడు
పంచుకొనే తిన్నాము.
స్టేజి మీద వక్తను నేనై
వంత పలికే మైకు నీవై
ఆత్మీయులు ప్రేక్షకులై
అనురాగం రుచి చూపావు.
ముందుకు నడిపే చక్రం నేనై
బరువును మోసే బాధ్యత నీవై
సంసారం గట్టెక్కించాము.
సాగర మధనం గావించాము.
సృష్టి ధర్మం సంతానం
కనిపెంచుట మన ధర్మం
ఒక్కరిద్దరు చాలంటూ,
ఒద్దికతో ఒకరినె కన్నాం.
కష్టమేమి రాకుండా
కన్నుల్లో పెంచాము
భావితరం పౌరున్ని
భారతాని కందించాము.
కట్నమేమి తెచ్చావని
కసిరి విసిరి కొట్టింది లేదు.
మీరేం పెట్టారని నను
మరి మరి విసిగించలేదు.
అందంలో చందనబొమ్మై
ప్రేమకు రూపము నిచ్చావు
ప్రక్కనున్న అందాలకు
నన్నురుకులు పెట్టనీక.
ఇంటికి పరిమితం చేసి
ఇబ్బందిని నే నవలేదు.
స్వేచ్ఛ నీకు ఇచ్చాను.
సంతృప్తిని నా కిచ్చావు.
ఎంతో కొంత పని చేసాం.
ఇంతో అంతో వెనకేశాం.
ఉన్నదానితో తృప్తిని పొంది
ఉన్నతంగా జీవించాము.
ప్రేమంటే మనదేనని,
పెన్నిధు లింకెందు కని,
ఆనందపు టంచులు చూసి
అనురాగపు దివ్వెల మైనాం.
దాంపత్యం అర్థం తెలిసి
ధన్యులమై బ్రతికాము.
ఇరుగు పొరుగు వారికిపుడు
ఆదర్శం అయినాము.

-కొండ్రెడ్డి నాగిరెడ్డి




## ఉగాది పండుగ ప్రస్తావన:

చైత్ర శుద్ధ పాడ్యమి నూతన తెలుగు సంవత్సరాది భారత దేశంలో ఉన్న హిందూవులైన తెలుగువారందికీ-ఉగాది పండుగ... 2025లో మార్చి 30 ఆదివారం ఉగాది పండుగ వచ్చింది. 2025 మార్చి 30 నుంచి విశ్వావసు నామ సంవత్సరంలో అడుగుపెట్టబోతున్నాం... విశ్వావసు నామ సంవత్సరం గతంలో 1965 -1966 లో వచ్చింది. ఉగాదిలో ఉగ' అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది అంటే సృష్టి ఆరంభమైనదినమే ఉగాది. యుగం అనగా 'ద్వయంబీ లేదా 'జంట' అని అర్థం. ఉత్తరయణ, దక్షిణాయణ ద్వయ సంయుతం యుగం కాగా.. ఆ యుగానికి ఆది యుగాదిగా మారింది. ఉగాది శబ్దానికి ప్రతిరూపంగా ఉగాదిగా రూపొందింది. ఉగాది అంటే అందరికి గుర్తుకు వచ్చేది తెలుగు వారి పండుగ. తెలుగు సంవత్సరం ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి ఇది తెలుగు వారి పండుగ గుర్తింపు తెచ్చుకుంది. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నూతన సంవత్సరంలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహశాంతులు లాంటివి జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచంగ శ్రవణాన్ని చేస్తారు. ఈ నేపథ్యంలో ఉగాది విశిష్టత, చరిత్ర గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

చైత్ర మాసం శుక్లపక్షం పాడ్యమి రోజున ఆ విధాత ఈ జగత్తును సృష్టించాడని నమ్ముతారు. సోమకుడు వేదాలను తస్కరించిన కారణంగా మత్స్యావతారం ధరించిన విష్ణువు అతడిని సంహరించి వాటిని తిరిగి బ్రహ్మదేవుడికి అప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణ ప్రతీతి. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున సూర్యోదయ వేళలో బ్రహ్మ దేవుడు సృష్టిని సృష్టించాడని అంటారు. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఆ రోజు వర్తింపజేస్తాడని నమ్మకం. అంతేకాకుండా వసంత రుతువు కూడా ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. అందుకే నూతన జీవితానికి నాందిగా ఉగాది పండుగను జరుపుకుంటారు.

## ఉగాది విశిష్టత :

హిందువులకు అత్యంత ముఖ్యమైన ఈ ఉగాది పండుగను ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఉన్న తెలుగు వారికి మాత్రమే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లోనూ, ఆనవాయితీగా వస్తున్న వారి ఆచార సంప్రదాయాలను బట్టి జరుపుకొవడం జరుగుతుంది. తెలుగు సంస్కృతితో అలరారే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాలలో ఉగాది తెలుగు సంవత్సరాదిగా బహు విశిష్టతను సంతరించుకుంది. పంచాంగ శ్రవణం జరుపుట ఆనవాయితీగా వస్తోంది. ఆ ఏడాదికి కలిసి వచ్చే శుభాలను పరిగణలోకి తీసుకునే ఆచారం కొనసాగుతోంది. ఈ విధంగా ఆ రంగాలకు కలిసి వచ్చే శుభాలను స్వీకరిస్తూ, జ్యోతిష్య పండితుని తమ శక్త్యాను సారం, సత్కరించుకుని పంచాంగ శ్రవణం వింటూ ఉండటం చూస్తుంటాము. అలాగే అనేకానేక సంస్కృతిక సంస్థలు సభలలో కవి, సమ్మేళనాలు జరుపుతూ, సందడి చేస్తూన్న "కవులకు" కోయిల కూత, వేప పూత వంటి కైతలు అందించిన కవిమిత్రులు, సుకవులు, రసజ్ఞులకు వసంత సంతస కుసుమార్చనలు అందించే శుభదినముగా కూడా చెప్పుకోవచ్చు." ఇక ఇంటింటా ఆ సంవత్సరము లోని మంచి చెడులను, ఆదాయ ఫలములను, స్థూలంగా తమ, తమ జన్మ నక్షత్రం ఆధారంగా, ఆ ఏడాది భవిష్యత్ క్రమము తెలుసుకొని దాని కనుగుణమైన నిర్ణయాలు తీసుకోటానికి దాదాపు ప్రతి ఒక్కరుకూడా ఇష్టత చూపుతారు. ఉగాది పండుగను జరుపుకుంటారు. ఉగాది సంప్రదాయాను సారంగా రైతులను గౌరవించే వేడుకగానూ, రైతులతో పాటుగా తెలుగు వారు ప్రతిఒక్కరు కూడా తమదిగా భావించే పండుగ ఉగాది.

## ఉగాది చరిత్ర:

ఉగస్యఆది అనేదే ఉగాది. "ఉగాది", మరియు "యుగాది" అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. "ఉగ" అనగా నక్షత్ర గమనం. నక్షత్రగమనానికి 'ఆది' 'ఉగాది'. అంటే సృష్టి ఆరంభమైనదినమే "ఉగాది". 'యుగము' అనగా ద్వయము లేక జంట అని కూడా అర్ధము. ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం 'యుగం' 'ఆది' అనగా మొదలు 'ఉగాది'. అనగా ప్రపంచము యొక్క జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయినది. సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయంకాలాది త్రికాలములకు ఉషాదేవతయే మాతృ స్వరూపము. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్రశుక్లపాడ్యమి నాడే, అనగా "ఉగాది'' రోజున బ్రహ్మ సృష్టిని నిర్మించడం ప్రారంభించారని నమ్ముతారు. మత్స్యావతారము ధరించిన విష్ణువు సోమకుని సంహరించి వేదాలను బ్రహ్మకప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చెనని పురాణైతిహాసంగా చెప్పబడుతున్నది. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్షాధికులను సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపబడుచున్నట్లుగాను, వసంత ఋతువు కూడా అప్పుడే మొదలవుతుంది కనుక కొత్త జీవి తానికి నాంది, ఆది వేది పునాదిగా ఉగాది పండుగను జరుపుకుంటారు. శాలివాహన, తన శౌర్యపరాక్రమాలతో యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతున్నదని చారిత్రక వృత్తాంతం. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్నిర గుల్కొల్పి మానవాళిలో నూతనాశయాలను అంకురింపచేసే శుభదినం 'ఒక్క తెలుగు సాంప్రదాయంలోనే కాక మరాఠీలు గుడి పడ్వాగానూ, తమిళులు పుత్తాండు అనే పేరుతో, మలయాళీలు విషు అనే పేరుతోను, సిక్కులు వైశాఖీ గానూ, బెంగాలీలు పొయ్లా బైశాఖ్ గానూ జరుపుకుంటారు. అందుకు కారణం ఉగాది పండుగ వచ్చే నాటికి, శిశిర ఋతువు ఆకురాలు కాలం. తరువాత వసంతం ఋతువు వస్తుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా వుంటుంది. కోయిలలు కుహూకుహూ అని పాడుతాయి. ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంకరిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్తబట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. "ఉగాది పచ్చడి" ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం – తీపి (మధురం), పులుపు (ఆమ్లం), ఉప్పు(లవణం), కారం (కటు), చేదు (తిక్త), వగరు(కషాయం) అనే ఆరురుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యేమంచి చెడులను, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్నసందేశాన్నిఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.. ఈ పచ్చడి కొరకు చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు, చింతపండు, జామకాయలు, బెల్లం మొదలగునవి వాడుతుంటారు.

## ఉగాది పచ్చడి :

కావలసిన పదార్థాలు: మామిడికాయ (ఓ మాదిరిపరిమాణం కలది)- 1, వేప పువ్వు- 1/2 కప్పు, సన్నగా తరిగిన కొబ్బరిముక్కలు- 1/2 కప్పు, నీళ్లు, కొత్తచింతపండు- 100 గ్రాములు, కొత్తబెల్లం- 100 గ్రాములు, మిరపకాయలు- 2, అరటిపండు - 1, చెరకురసం -1/2 కప్పు, ఉప్పు- సరిపడేంత, అవసరమైతే అరటి పళ్లు, జామకాయలను కూడా వేసుకోవచ్చు.

## తయారీ విధానం:

ఉగాది పచ్చడి తయారినీ (ఒక్కొక్కరు, వారి ఇంటి సంప్రదాయానుసారంగా తయారు చేసుకుని సేవించడం ఆనవాయితీ) ఉగాది పచ్చడిని తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు కలసిన షడ్రుచుల సమ్మేళనం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఈ పచ్చడి ఇస్తుంది. ఈ వచ్చడి కొరకు చెఱకురసం, అరటి పళ్లు, మామిడి కాయలు, వేప పువ్వు, చింతపండు, జామకాయలు, బెల్లం మొదలైనవి వాడుతారు. ముందుగా వేపపువ్వు ను కాడల నుంచి వేరుచేసి పెట్టుకోవాలి. చింతపండులో కొద్దిగా నీళ్లు పోసి నానబెట్టి పది నిమిషాల తర్వాత దాని గుజ్జును వేరుచేయాలి. పచ్చి మామిడికాయ, పచ్చి మిరపకాయ, కొబ్బరి నిసన్నగా తరగాలి. తర్వాత చెరకురసం సిద్ధంచేసి, మిగతా పండ్లను కూడా సన్నగా తరిగి పెట్టుకోవాలి. బెల్లాన్ని కూడా తురిమి పెట్టుకొని వాటిని చింత పండు గుజ్జులో కలపాలి. ఈ మిశ్రమంలో మామిడి కాయ ముక్కలు, తరిగిన కొబ్బరి, మిరప కాయ ముక్కలను వేసి చివరిగా ఒక అర స్పూను ఉప్పువేసి కలుపుకోవాలి. అంతే షడ్రుచుల ఉగాది పచ్చడి సిద్ధమైపోయినట్టే. ఇక వసంత లక్ష్మిని ఆహ్వానించి, నైవేద్యంగా సమర్పించి, తర్వాత స్వీకరించాలి. అంతేకాదు మిగతా వాళ్లకు అందజేయండి. కష్ట సుఖాలను జీవితంలో చవి చూడాలనే నిజాన్ని ఉగాది పచ్చడి సేవనం తెలియజేస్తుంది. ఉగాది పచ్చడి సేవించడం వలన కలిగే ప్రయోజనాలు పోషకాలు (1 కప్పు- 200 గ్రాములు): కేలరీలు: 201 కిలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు: 6.9 గ్రా, ప్రోటీన్: 8.2 గ్రా, కొవ్వు: 16 గ్రా, సంతృప్తకొవ్వు: 8.6 గ్రా, కొలెస్ట్రాల్: 41 మి.గ్రా, సోడియం: 503 మి.గ్రా, పొటాషియం: 291 మి.గ్రా, ఫైబర్: 1.6 గ్రా, చక్కెర: 3.7 గ్రా, విటమిన్ ఎ: 8%, విటమిన్ సి: 8%, కాల్షియం: 10%, ఇనుము: 4%. నేడు భారతదేశం అనుసరించే ఆచార వ్యవహారాలనూ, వాటిలో దాగి ఉన్న, ఉన్నత విలువలకు అబ్బురపడుతూ, మేము సైతం అంటూ విదేశీయులు వాటి పట్ల మొగ్గు చూపుతున్నారట. షడ్రుచుల తో తయారుచేసిన ఉగాది పచ్చడిని, అందులో మిళితమై ఉన్న, ఔషధ విలువలు తెలుసుకున్నారేమో కానీ, ఉగాది పచ్చడిని, సేవించడానికి తెగ ఆసక్తి చూపుతున్నారని వినికిడి. వహ్వా భారత్ ...

## పంచాంగ శ్రవణం :

పంచాగ శ్రవణం ఉగాది రోజు దేవాలయంలోగానీ, గ్రామ చావడిలోగానీ, కూడలిలోగానీ, ఇంకా ఇంటిలో అయితే యజమానే స్వయంగా పంచాంగ శ్రవణం చేయడం ఆచారం. పంచాగం అంటే ఐదు అంగాలు అని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేది ఉగాది రోజున లక్ష్మీ దేవిని, ఇంకా దేవతలను పూజించి పంచాంగ శ్రవణం చేయడం ఆనవాయితి. పంచాంగ శ్రవణం చేసిన వారికి విన్నవారికి సూర్యుడు సౌమ్యాన్ని తేజస్సును, చంద్రుడి వైభవాన్ని, కుజుడు సర్వ మంగళాలను, బుధుడు బుద్ధి వికాసాన్ని, గురుడు గురు కృపని జ్ఞానాన్ని, శుక్రుడు సుఖాన్ని, శని దుఃఖరాహిత్యాన్ని, రాహువు వలన ప్రాబల్యం, కేతువు ప్రాధాన్యత లభింపచేస్తారని పండిత ఉవాచ. ఈ ఉగాది శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరంలో వచ్చే 39వ సంవత్సరగానూ, ఈ సంవత్సరంలో జన్మించిన వారు విశేషంగా రాణిస్తారని, సుగుణ శీలులై ఉంటారని, స్నేహం పట్ల విశ్వాసం, ధైర్యంతో పనులు చక్కపెడతాని, అన్ని నక్షత్రాలవారికి శుభకరంగా ఉంటుందని పండితులు వక్కానించడం గమనార్హం.

## కవులకు విందు పసందు :

కవులు-కవయిత్రుల కవి సమ్మేళన సందళ్ళ సంరంభం. కవుల వర్ణనలో వసంత రుతు శోభను వర్ణిస్తూ 'క్రొత్తగా జతకట్టిన కోకిలమ్మ పెంటికై నూత్న యౌవనోద్వేగ వేగి యగుచు, ముక్కున చిదుమని ఆమ్ర కిసలయమ్ము లేదు వసంత వనాంత వీధి' అంటూ మావి లే చిగుళ్ల మాధుర్యాన్ని ప్రస్తుతించారు. బమ్మెర పోతనదీ అదే దారి– 'బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్య కన్యక'గా తన భాగవతాన్ని భావన చేశారు. ఇంతటి మహోన్నతమైన శ్రీ విశ్వావసు నామ ఉగాదికి శ్రీరస్తు, శుభమస్తు. ఈ శ్రీ విశ్వావసు నామ ఉగాది సంవత్సరం – అందరికీ శుభప్రదం కావాలి.

శుభం భూయాత్. సర్వే జనాః సుఖినో భవంతు.



-శారద శృంగేరి
9490 26 1119

